# తృప్తీ నీవెక్కడ?

కేతవరపు రాజ్యశ్రీ



ది.06.03.2011న చిన్న పరిశ్రమల శాఖామంత్రి శ్రీ శంకరరావుగారిచే మిడియా డైరీ ఆవిష్కరణ సందర్భంగా సత్కారం



ప్రముఖ చారిత్రక నవలా చక్రవర్తి డా॥ ముదిగొండ శివ ప్రసాద్‌గారిచే సత్కారం. చిత్రంలో ప్రముఖ కవి, సాహితీవేత్త డా॥ పోతుకూరి సాంబశివరావుగారు, నేటి నిజం ఎడిటర్ శ్రీ బైసా దేవదాసుగారు, సాహితీకిరణం ఎడిటర్ శ్రీ పొత్తూరి సుబ్బారావుగారు, రచయిత్రి భర్త శ్రీ కేతవరపు మాధవరావుగార్లు ఉన్నారు.



"వెన్నెల మెట్లు" పుస్తకావిష్కరణ సందర్భంగా ఆవిష్కర్త డా॥ కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్., రెవిన్యూ ముఖ్య కార్యదర్శి, డా॥ ద్వానా శాస్త్రి, డా॥ పి.ఎస్. మూర్తి, శ్రీ సుధామ, శ్రీ సుగమ్ బాబు, రఘుశ్రీ, శ్రీ కె. మాధవరావు ఉన్నారు.



సచివాలయ సాంస్కృతిక సంఘం వారిచే సత్కారం. డా॥ యం. కాంతారావు, ఐ.పి.ఎస్., డైరెక్టర్ ఆఫ్ కల్చర్‌గారిచే మెమోంటో స్వీకరణ. చిత్రంలో డా॥ కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్., రెవిన్యూ ముఖ్యకార్యదర్శి, శ్రీమతి శైలజా సుమన్, దూరదర్శన్ డైరెక్టర్, జనార్ధన్ ఉన్నారు.

# తృప్తీ నీవెక్కడ?

కేతవరపు రాజ్యశ్రీ

ప్రచురణ - 2011

# స్నేహానికి సంకేతం నువ్వు

మొదటిసారి నిన్ను
దూరం నుంచి చూసినప్పుడు
"నీతో స్నేహం చేస్తే" అన్పించింది
కాకతాళీయంగా మనం స్నేహితులమైనాం
గత జన్మబంధం నాకు తెలిసింది
ఇదే మనస్సులోని గుట్టు
ఇప్పుడే విప్పుతున్నా నీ ముందు
ఒక పువ్వులో విరిసిన రేకలు కాకపోయినా
స్నేహం కలువలో వికసించిన రేకలం
స్నేహానికి సంకేతం నువ్వు
ఆనందానికి ఆలంబన నువ్వు
ఉత్సాహం నీవెంటే ఉరకలేస్తుంది
నవ్వులు నీవెంటే పరుగులెడతాయి
అగ్ని శిఖలా నీవు వెలిగినా
చల్లని మంటలే సోకుతాయి
ఛలోక్తుల బాణాలు సంధించినా
పువ్వుల బాణాలై మదిని తాకుతాయి
చమత్కారానికి నీవే అడ్రస్సు
చైతన్యానికి నీవే వేదిక
నీ భావి జీవితం సకల శుభ భరితం కావాలని
జగదంబికను ప్రార్థిస్తూ...

నీ నెచ్చలి రమ
విశ్రాంత ప్రభుత్వ అదనపు కార్యదర్శి



శ్రీమతి పద్మ



శ్రీమతి నాగేంద్రమణిగారిచే పుస్తక బహుకరణ.



పదవీ విరమణసందర్భంగా సత్కరిస్తున్న శ్రీమతి జయశ్రీ, ప్రభుత్వ విశ్రాంత ఉపకార్యదర్శి.



బ్రహ్మకుమారి సంస్థవారిచే సత్కారం.



సచివాలయ ఉద్యోగినీ సంక్షేమ సంఘంచే సత్కారం.



ప్రఖ్యాత గాయని కుమారి సి. కృష్ణకుమారి



శ్రీమతి టి. విజయలక్ష్మి



శ్రీమతి పి. జయశ్రీగారిచే సత్కారం



శ్రీమతి నాగ సత్యవతిగారిచే సత్కారం



శ్రీమతి జె. కుసుమకుమారి



శ్రీమతి కనకదుర్గ



శ్రీమతులు పద్మావతి మరియు విజయలక్ష్మి



శ్రీమతి శ్రీలత



అక్కచెల్లెళ్ళతో



శ్రీమతి సులోచన



శ్రీమతి విజయశ్రీ

ఆంధ్రప్రభ సోమవారం 18, ఏప్రిల్ 2011

# రాజ్యశ్రీ 'వెన్నెల మెట్లు' ఆవిష్కరణ



వెన్నెల మెట్లు పుస్తక ఆవిష్కరణ సభలో పాల్గొన్న డాక్టర్ రమణాచారి, రాజశ్రీ తదితరులు

వివేక్‌నగర్, ఏప్రిల్ 17 (కెఎన్ఎన్): జీవిత సత్యాలను చిన్నచిన్న పదాలతో కవితల రూపంలో ఆవిష్కరించిన కేతవరపు రాజ్యశ్రీ కవయిత్రిగా, రచయిత్రిగా, కావ్యకర్తగా, కార్యకర్తగా తెలుగు సాహిత్య రంగానికి సేవలందిస్తున్నారని రాష్ట్ర దేవాదాయ శాఖ (రెవెన్యూ) ముఖ్య కార్యదర్శి డాక్టర్ కెవి రమణాచారి పేర్కొన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్ శ్రీత్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో కళా సుబ్బారావు కళా వేదికలో కేతవరపు రాజ్యశ్రీ రచించిన వెన్నెల మెట్లు (రెక్కలు) కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమణాచారి వెన్నెల మెట్లు కవితా సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కవయిత్రి రాజ్యశ్రీ రచించిన కవితల్లోని భావాలు ఎందరికో అనుభవైక వైద్యమని అన్నారు. ఈ కవితా సంపుటిని రాజ్యశ్రీ తన భర్త మాధవరావుకు అంకితమివ్వడం భారతీయ దాంపత్య జీవితానికి అద్దంపడుతుందని రమణాచారి అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత కార్టూనిస్టు సుధామ మాట్లాడుతూ, ఒక నిశిత పరిశీలకురాలుగా రాజ్యశ్రీ సాహితీ క్షేత్రంలో ఎదుగుతున్నారని అన్నారు. తన చుట్టూ ఉన్న మనుష్యుల అంతరంగాలను పరిశీలించి, పరిశోధించి సృజనాత్మకమైన కవిత్వం రాస్తున్న రాజ్యశ్రీని ఆయన అభినందించారు. కవయిత్రి రాజ్యశ్రీ తన అనుభూతుల్ని పలు కవితల్లో వ్యక్తీకరించారని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ద్వానా శాస్త్రి అన్నారు. డాక్టర్ పిఎస్ రావు, కళాదీక్షితులు, కేతవరపు మాధవరావు తదితరులు సభలో పాల్గొన్నారు.

వార్త మంగళవారం 26, ఏప్రిల్ 2011

# 'నీలోకి నువ్వు' ఆధ్యాత్మిక గ్రంథం ఆవిష్కరణ

కాచిగూడ, ఏప్రిల్ 25 ప్రభాతవార్త : వాస్తవాలకు దూరంగా ఉండి మానసిక రుగ్మతలతో ఉన్నవారికి 'నీలోకి నువ్వు' ఆధ్యాత్మిక గుళికలు ఔషధంలా పని చేస్తాయని అనడంలో అతిశయోక్తి లేదని ప్రముఖ చారిత్రక నవలా చక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ అన్నారు. సోమవారం కళాసుబ్బారావు కళావేదికలో జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్-శ్రీత్యాగరాయగానసభలో ప్రముఖ రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ రచించిన 'నీలోకి నువ్వు' ఆధ్యాత్మిక గుళికలు గ్రంథావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రాచీనులు అందించిన దివ్యమైన సందేశంలో నిన్ను నీవు ఉద్ధరించుకున్నప్పుడే ప్రపంచం అంతా ఉద్ధరించుకున్నట్లవుతుందన్నారు. మౌనంతోనే సమాధానం ఉంటుందని రమణమహర్షి దివ్య సందేశం అందించేవారని అన్నారు. ఉత్తమ రచనలు వెలువరిస్తున్న కేతవరపు రాజ్యశ్రీ అభినందనీయురాలని అన్నారు.



రాజ్యశ్రీ రచించిన 'నీలోకి నువ్వు' ఆధ్యాత్మిక గ్రంథం ఆవిష్కరించిన దృశ్యం

భవిష్యత్తులో ఇలాంటి ఆధ్యాత్మిక రచనలు వెలువరించాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ ద్వా.నా.శాస్త్రి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పోతుకూచి సాంబశివరావు, నేటినిజం సంపాదకులు బైసా దేవదాస్ దీక్షితులు, తూములూరి రాజేంద్రప్రసాద్, పొత్తూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం సంస్థల పక్షాన అతిథులు రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీని ఘనంగా సత్కరించారు. జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఛైర్మన్ గుడిబండి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.వి. రాఘవరెడ్డిలు సభకు స్వాగతం పలికి నివేదిక సమర్పించారు.

## మహనీయుడు సాయిబాబా: ముదిగొండ శివప్రసాద్

మట్టి మూలాలు, మూల్యం తెలుసుకుని జీవితాంతం విశ్వవ్యాప్తం చేయడానికి అవిశ్రాంత కృషి చేసిన మహనీయుడు భగవాన్ సత్యసాయిబాబా అని ఆచార్య ముదిగొండ శివప్రసాద్ అన్నారు. సత్య సాయిబాబా నిర్యాణసందర్భంగా ఆధ్యాత్మిక గుళికల గ్రంథాన్ని ఆవిష్కరించి బాబాకు అంకితం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. బలవంతులకు మంచి నేర్పు, మంచివారిని బలవంతులను చేయమని సత్య సాయిబాబా సందేశం అని అన్నారు.

శ్రీరాముడు, కృష్ణుడు, స్వామి వివేకానందుడిని మనం ప్రత్యక్ష గా చూడక పోయినప్పటికీ తెలుగువాళ్లై మనగడ్డపై జన్మించిన సత్యసాయి బాబాను ప్రత్యక్షంగా చూడటం జన్మ ధన్యమైందన్నారు. సత్యసాయిబాబా భౌతికంగా లేకపోయినప్పటికీ భావ సందేశం రూపంలో మన మధ్యలోనే ఉన్నారని అన్నారు.

# హితాన్ని కోరేదే సాహిత్యం

## కెవీ రమణాచారి



వెన్నెల మెట్లు కవితా సంపుటి ఆవిష్కరణ దృశ్యం

**హిమాయత్ నగర్, న్యూస్‌లైన్ :** సమాజ హితమున్నప్పుడే ఏ సాహిత్య ప్రక్రియకైనా సార్థకత లభిస్తుందని దేవాదాయ ముఖ్య కార్యదర్శి (రెవెన్యూ) కేవీ రమణాచారి అన్నారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి కళాసుబ్బారావు కళావేదికలో కేతవరపు రాజ్యశ్రీ రచించిన వెన్నెల మెట్లు కవితా సంపుటి ని రమణాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్రమైన విషయాన్ని సంక్షిప్తంగా కవితా రూపంలో రాజ్యశ్రీ అత్యద్భుతంగా చెప్పారని కొనియాడారు. పైగా తన భర్తకే సంపుటిని అంకితం ఇవ్వడం ఆమె ఔన్నత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రముఖ కవి సుధామ సభాధ్యక్షత వహించారు. మానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయ గానసభల సంయుక్త సహకారంలో జరిగిన ఈ కార్యక్రమంలో కవి విమర్శకులు డాక్టర్ ద్వానా శాస్త్రి, ప్రముఖ ప్రము ఖ కవి, రెక్కల రూపశిల్పి ఎంకే సుగంబాబు, తూములూరి రాజేంద్ర ప్రసా ద్, డాక్టర్ ఆర్.ఎస్.మూర్తి, రఘుశ్రీ, రచయిత భర్త మాధవ రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజ్యశ్రీని సత్కరించారు.

ఆంధ్రప్రభ | మంగళవారం 26 ఏప్రిల్ 2011

# 'నీలోకి నువ్వు' పుస్తకావిష్కరణ



వివేక్‌నగర్, ఏప్రిల్ 25, (కెఎన్ఎస్): ముందుగా నీలోకి నువ్వు చూస్తే చాలు ప్రపంచమంతా ఉద్ధరింపబడుతుందని, రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ తాను తెలుసుకున్న తత్వాన్ని పదిమందికి చెప్పాలని నీలోకి నువ్వు ఆధ్యాత్మిక గుళికలు పుస్తకాన్ని రచించి జాతికి వరంగా, కానుకగా అందించారని ప్రముఖ చారిత్రక నవలా చక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ వ్యాఖ్యానించారు. జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్, శ్రీత్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కళా సుబ్బారావు కళా వేదికలో రాష్ట్ర ప్రభుత్వ ఉప కార్యదర్శి (సాధారణ పరిపాలనశాఖ), ప్రముఖ రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ రచించిన నీలోకి నువ్వు పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య శివప్రసాద్ నీలోకి నువ్వు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ పుస్తకాన్ని రచించిన రాజ్యశ్రీ తన జీవితాన్ని సాఫల్యం చేసుకున్నారని అన్నారు. ఈ ప్రపంచంలో గొప్ప వ్యక్తిగా సత్యసాయిబాబా కీర్తింపబడ్డారని, అయితే బాధాకర విషయం ఏమిటంటే చివరి దశలో ఆయనకు అటువంటి మరణం రాకూడదని, హాయిగా మాట్లాడుతూ తన దేహాన్ని చాలించి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం సత్యసాయిబాబాకు నివాళులుగా అర్పించడం చాలా సముచితంగా ఉందని ఆయన అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ద్వానా శాస్త్రి మాట్లాడుతూ, చక్కటి ఆధ్యాత్మికమైన పుస్తకాన్ని రాజ్యశ్రీ రచించారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళావెంకట దీక్షితులు జ్యోతిని వెలిగించి సభను లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పోతుకూచి సాంబశివరావు రాజ్యశ్రీని అభినందిస్తూ ప్రసంగం చేశారు. ప్రముఖ కవి తూములూరి రాజేంద్రప్రసాద్ పుస్తక సమీక్ష చేశారు. నేటి నిజం సంపాదకులు బైసా దేవదాస్ సభలో పాల్గొన్న అతిథులను శాలువాలతో సత్కరించారు. ఈ సభకు సంస్థ అధ్యక్షుడు గుడిబండి వెంకటరెడ్డి స్వాగతం చెప్పారు. సంస్థ ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి, రాజ్యశ్రీ భర్త కేతవరపు మాధవరావు తదితరులు సభలో పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ
సోమవారం 18 ఏప్రిల్ 2011

# 'చేతనా'ఝరి - రాజ్యశ్రీ

అంతా మహిళా చైతన్యం గురించి, మహిళా సంక్షేమం గురించి మాట్లాడే వారే కానీ వాస్తవంలో మహిళా సాధికారతకు ఎప్పటికి వారు వ్యక్తిగతంగా ఏ మాత్రం చేయూత నిస్తున్నారు? అని ప్రశ్నిస్తే చాలా మంది నుంచి సంతృప్తి కరమైన జవాబు దొరకదు. దశాబ్దాలు గడుస్తున్నా, స్వాతంత్ర్యం వచ్చి ఆరున్నర దశాబ్దాలు గడిచినా, మహిళా హక్కుల కోసం రాజ్యాంగ పరంగా, అంతర్జాతీయంగా చట్టాలు



చేస్తున్నా ఫలితాలు అంతంత మాత్రమే అంటారు రాజ్యశ్రీ.

మహిళలు అన్ని రంగాల్లో అనేకానేక అవరోధాలు అధిగమించి ముందుకు వెళుతున్నా పురుషాధిక్య ప్రపంచంలో కష్టాలు, నష్టాలు తప్పడం లేదు. ఒక వైపు గృహహింస, మరో వైపు సమాజంలో ముఖ్యంగా కార్యాలయాల్లో, ఉద్యోగ, వ్యాపార కేంద్రాల్లో సైతం వేధింపులు, సాధింపులు తప్పడం లేదు అని తన ఆవేశాన్నీ, ఆక్రోశాన్నీ కవితా రూపంలో జ్వలింప చేస్తారు రాజ్యశ్రీ.

అయితే స్త్రీల సహనం, ఓర్పు అశక్తతలు కావని, శక్తి అవే ఆయుధాలని గ్రహించి ఎన్ని కష్టాలు ఎదురైనా ఎన్ని నష్టాలు భరించవలసి వచ్చినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ముందుకు సాగినప్పుడే మహిళా విజయం సాధ్యం అంటారామె.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలంటే బహుముఖ్యంగా ఎదగాలని చెప్పే రాజ్యశ్రీ వృత్తిరీత్యా ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ప్రభుత్వ ఉప కార్యదర్శి, ప్రవృత్తి రీత్యా కవితా సేద్యం చేస్తు న్నారు. వారు సాంస్కృతిక, సాహిత్య పిపాసి. రచనా వ్యాసంగాన్ని అసిధారా వ్రతంగా స్వీకరించారు.

**పర్యావరణ చైతన్యం**

రాజ్యశ్రీ చేతన సచివాలయ సాహితీ వేదిక అధ్యక్షురాలిగా అక్కినేని అమలచే పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె ప్రతి సంవత్సరం ఇటువంటి సదస్సును నిర్వహించటమే కాక చలన చిత్ర ప్రదర్శన, మొక్కల పంపిణీ, ప్లాస్టిక్‌ను మాని బట్ట సంచీ తీసుకువెళ్ళే అలవాటును ప్రోత్సహిస్తున్నారు.



**కవితా సేద్యం**

ఆమె 'చేతన' సచివాలయ సారస్వత వేదికకు అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె 'స్త్రీవాద రచనలు అపోహలు' అంశంపై అబ్బూరి ఛాయాదేవితో ప్రసంగం, యుద్దనపూడి నవలలపై ఇష్టాగోష్ఠి వివాహ వ్యవస్థ సామాజిక విలువలు అంశంపై సత్యవాణి ప్రసంగం, మౌఖిక సాహిత్యంలో మానవీయత అంశంపై గోరేటి వెంకన్న ప్రసంగం నిర్వహించారు.



**సేవావ్రతి**

రాజ్యశ్రీ ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా సంక్షేమ సంఘ వ్యవస్థాపక కార్యదర్శిగానే కాక, సంఘమిత్ర లయనెస్ క్లబ్‌కు పూర్వాధ్యక్షురాలుగా, సంఘమిత్ర వృద్ధాశ్రమానికి పూర్వకార్యదర్శిగా సేవలందిస్తున్నారు.

**మహిళా ఉద్యోగుల సంక్షేమ దిశగా...**

ఉద్యోగినుల కోసం ప్రత్యేకంగా కంప్యూటర్ శిక్షణ తరగతులు, ఆర్థిక పురోగతిలో ఉద్యోగినుల పాత్ర అంశంపై సెమినార్లు, మహిళల కోసం ప్రత్యేక గైనకాలజిస్ట్ వైద్య సేవలు, వారికి యోగ, మెడిటేషన్ తరగతులు, ప్రసూతి సెలవును నాలుగునెలలు పెంచడం, ఉద్యోగినుల మనోవికాసానికి ఆటల పోటీలు, ఆత్మవిశ్వాసం కల్గించటానికి విశేష కృషి చేశారు.

**గృహహింసకు చెల్లు చీటీ**

గృహహింస చట్టం గురించి సరైన అవగాహన కల్గిస్తూ అది మహిళా రక్షణకు ఎలా కవచంలా ఉపయోగపడేదీ పుస్తక ప్రచురణ ద్వారా చైతన్యం రాజ్యశ్రీ కల్పించారు.

**విధులకు గుర్తింపు:**

రాజ్యశ్రీకి క్లబ్ ఆఫ్ హైదరాబాదు, సనత్‌నగర్ వారిచే డెడికేటెడ్ సర్వీసు అవార్డు 1995లో లభించింది.ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగినీ సంక్షేమ సంఘం వారి దశాబ్ది ఉత్సవాలలో సంఘ వ్యవస్థాపక కార్యదర్శిగా డా॥ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీమతి జయసుధ గారిచే 2004లో, దూరదర్శన్ కేంద్రం హైదరాబాదు వారిచే ఉగాది కవిసమ్మేళన 2009 సత్కారం లభించాయి. సిలికాంధ్ర, టిటిడి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖవారు నిర్వహించిన అన్నమాచార్య లక్షగళ సంకీర్తనలో పాల్గొన్నందుకు 2009లో గిన్నీస్ బుక్‌లో పేరు, ప్రశంసాపత్రం. "గుండెచప్పుళ్లు" పుస్తకావిష్కరణ సందర్భంగా ఆరాధన సంస్థ వారిచే 2009లో సత్కారం డా॥ అక్కినేని నాగేశ్వరరావుగారిచే సన్మానం.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సచివాలయ ఉద్యోగినీ సంక్షేమ సంఘ స్థాపక కార్యదర్శిగా సేవలందించినందుకు మార్చి 8.2001న సన్మానం జరిగాయి.

-ఎస్.శారద

# 'గుండె చప్పుళ్లు' పుస్తకావిష్కరణ

ఖైరతాబాద్, న్యూస్‌లైన్:

మర్రి విత్తనమంత కవిత్వంలో మహావృక్షమంత భావాన్ని పొదిగినట్లుగా రచించిన 'గుండె చప్పుళ్ళు'(నానీలు) పుస్తకాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందని హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం డైరెక్టర్ పాలకుర్తి మధుసూదనరావు అన్నారు.

బుధవారం సచివాలయంలోని డి బ్లాక్ సమావేశ మందిరంలో ఆరాధన, చేతన సంస్థల ఆధ్వర్యంలో హోం శాఖలో ప్రభుత్వ సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.రాజశ్రీ రచించిన 'గుండె చప్పుళ్ళు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలకుర్తి మధుసూదన్ హాజరయ్యారు. పుస్తకావిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగిగా పనిచేస్తూ అన్ని కోణాల నుంచి ఆలోచించి 168 కవితలతో పుస్తకాన్ని రచించడం ఎంతో అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రభ సంపాదకులు పి. విజయబాబు, గిన్నిస్ బుక్ రికార్డు హోల్డర్ గజల్ శ్రీనివాస్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి ఎస్.రమాదేవి, ప్రభుత్వ అదనపు కార్యదర్శి జి.డి అరుణలు ప్రసంగించారు. న్యాయశాఖ సహాయ కార్యదర్శి లంక లక్ష్మి నారాయణ పుస్తక సమీక్ష చేశారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం డైరెక్టర్ మధుసూదనరావు

**అక్కినేనికి అంకితం...**

'గుండెచప్పుళ్ళు' కవితా సంపుటి ని పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావుకు అంకితం చేసినట్లు రాజశ్రీ తెలిపారు. కార్యక్రమానికి ఆరాధన అధ్యక్షుడు గుదిబండి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లోకం కృష్ణయ్య, చేతన సచివాలయ సారస్వత వేదిక ఉపాధ్యక్షులు జి.కృష్ణవేణి, కార్యదర్శి ఎన్.ప్రసాద్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఊహల వసంతం' కవితా సంపుటి ఆవిష్కరణ

24-4 2010

హైదరాబాద్, ఏప్రిల్ 23 (మేజర్‌న్యూస్ సిటీబ్యూరో) సచివాలయ ఉద్యోగిని శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ రచించిన 'ఊహల వసంతం' కవితా సంపుటి శుక్రవారం రవీంద్రభారతి సమావేశహాలులో ఆవిష్కృతమైంది. ప్రముఖ నటుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు ఈ కవితా సంపుటిని ఆవిష్కరించగా, సాహితీ విమర్శకుడు ద్వానాశాస్త్రి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. జీవీఆర్ ఆరాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ పుస్తకావిష్కరణ సభలో ఆంధ్రప్రభ సంపాదకుడు పి. విజయబాబుతోపాటు రాష్ట్ర సాంస్కృతికశాఖ సంచాలకులు డాక్టర్ ఎం. కాంతారావు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కినేని ప్రసంగిస్తూ.. ప్రకృతిలో అన్ని జీవరాశులతోపాటు పుట్టినప్పటికీ మన మానవ జాతికి మాత్రం ఇతర జీవులకు లేని బుద్ధిని ప్రకృతి ప్రసాదించిందని పేర్కొన్నారు. బుద్ధిజీవులైన మానవులు మాటలు, ఊసులు, ఊహలు, లిపి, చిత్రలేఖనం వంటి ప్రత్యేక గుణాలను సంతరించుకున్నారని, ఆ పరిణామక్రమంలోనే మనకు భారత, రామాయణ గ్రంథాలు ఉద్భవించాయని అక్కినేని పేర్కొన్నారు. అలాగే సాహితీ సృజన లో పురుషులకంటే కవయిత్రులకు, రచయిత్రులకు ప్రత్యేకతలు ఉంటాయని, ఈ ఊహల వసంతం రాసిన కేతవరపు రాజ్యశ్రీ రచనలో కూడా ప్రత్యేకత ఉందని అక్కినేని కొనియాడారు. సాంస్కృతికశాఖ సంచాలకులు డాక్టర్ ఎం. కాంతారావు మాట్లాడుతూ సాహితీ సృజన అనేది మన మానవ సమాజంలో ఓ సాంస్కృతిక సుధ్ధమని అభివర్ణించారు. అందునా స్త్రీల సాహితీ సృజనలో ప్రత్యేకమైన భావాలు, అభిరుచులు, అభిప్రాయాలు ఇమిడి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కవయిత్రి రాజ్యశ్రీ కవితల్లో సామాజిక కుటుంబ వ్యవస్థకు దర్పణంగా పట్టే వాస్తవిక వస్తువైవిధ్యం ఇమిడి ఉంటుందని కొనియాడారు.



రవీంద్రభారతి సమావేశ హాలులో ఊహల వసంతం కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న నటుడు అక్కినేని నాగేశ్వరరావు

# రచనలు సమాజాన్ని ప్రగతిపథం వైపు పయనింపచేయాలి

## " ఊహల వసంతం" కవితా సంపుటి ఆవిష్కరణ సభలో వక్తలు



" ఊహల వసంతం " సంపుటి ఆవిష్కరణలో ప్రారంభోపన్యాసం చేస్తున్న 'ఆంధ్రప్రభ' సంపాదకులు పి.విజయబాబు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రప్రభ ప్రతినిధి) : వర్తమాన రచయిత్రులు, కవయిత్రులు తమ రచనలను సమాజాన్ని ప్రభావితం చేసేలా మాత్రమేకాక, అవి ప్రగతిపథం వైపు పయనింపజేసేలా కృషి చేయాలని వక్తలు అన్నారు. సచివాలయంలోని చేతన సంస్థ ప్రధాన కార్యదర్శి కేతవరపు రాజ్యశ్రీ రచించిన కవితా సంపుటి ఊహల వసంతం ఆవిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగింది. గుదిబండి వెంకటరెడ్డి సారథిగా ఉన్న జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహించిన ఈ సభకు తెలుగు చలనచిత్ర రంగ అగ్రేసర నటుడు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఆంధ్రప్రభ దిన పత్రిక సంపాదకులు పి.విజయబాబు ప్రారంభోపన్యాసం చేశారు. తనకు కవిత్వం రాదంటూనే సంస్కృత శ్లోకాలను వల్లెవేస్తూ వాటికి సమగ్ర అర్థాన్ని చెబుతూ, అక్కినేని చేసిన ప్రసంగం సాహితీ ప్రియులను విశేషంగా ఆకర్షించింది. కవికుడి రచనను అర్థం చెడకుండా ప్రదర్శించేవాడే అసలైన నటుడని, ఈ విషయంలో తాను సినీనటుడిగా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లుగానే భావిస్తున్నానన్నారు. రచయితల గొప్పతనాన్ని ప్రదర్శించాల్సింది నటులేనని ఆయన స్పష్టం చేశారు. రాజ్యశ్రీ రచించిన ఊహల వసంతం కవితా సంపుటిలో పాండిత్యంకంటే వాస్తవిక దృక్పథం బాగా ఇమిడివుందని ఆయన అభినందించారు. పోలిక అనే శీర్షికతో రాజ్యశ్రీ రచించిన కవిత లోతుగా ఆలోచించే విధంగా ఉందని ఆయన అన్నారు. మగవారి కంటే ఆడవారు రెండురెట్ల ఆహారాన్ని అధికంగా తీసుకుంటారని, దీనిలో పరమార్థముందని ఆయన అన్నారు. తన రచనలకు మరింత పదును పెడుతూ రాజ్యశ్రీ ఈ రంగంలో ముందుకు సాగాలని అక్కినేని అభిలషించారు.

ప్రారంభోపన్యాసం చేసిన ఆంధ్రప్రభ సంపాదకు లు పి.విజయబాబు నటులకు, కవులకున్న అవినాభావ సంబంధాన్ని విడమరిచి చెప్పారు. మన సమాజంలో నగటు స్థితినుంచి అంచెలంచెలుగా ఎదిగిన కవులు, కవయిత్రులు ఉన్నారని, అదే విధంగా అక్కినేని, ఎన్‌టి రామారావు లాంటి మహానటులు సత్వగుణాన్ని అలవోకగా ప్రదర్శిస్తూ కథకుల రచనలకు ప్రాణం పోశారని ఆయన చెప్పారు. రచనలు సమాజాన్ని ప్రగతిపథం వైపు పయనింపచేయాలని, రచయితలు, రచయిత్రులు శబ్దాలంబన కోసం తపించి రచించాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలో పని చేస్తున్న ఉద్యోగినులు రాజ్యశ్రీ వలె రచనలకు శ్రీకారం చుట్టాలని విజయబాబు పిలుపునిచ్చారు. రచనలు చేసేవారు వారి భావుకతకు టెక్నిక్‌ను జోడించాల్సిన అవసరమున్నందున రచనలకు వర్క్‌షాపులను నిర్వహించాలని చేతన సంస్థకు విజయబాబు సూచించారు. కవులను, రచయితలను సత్కరించడంలో జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ అగ్రభాగాన ఉందని, ఒక కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి సాహితీప్రియులు పెద్ద సంఖ్యలో హాజరవడానికి ఈ సంస్థ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఔన్నత్యమే కారణమని సభికుల హర్షధ్వానాల మధ్య విజయబాబు తెలిపారు. సభకు ప్రముఖ సాహితీవేత్త ద్వా.నా.శాస్త్రి అధ్యక్షత వహించారు. సభాధ్యక్షుని హోదాలో అప్పుడప్పుడు ఆయన చేసిన ప్రసంగం సభికుల్లో ఆనందం నింపడంతోపాటు హాస్యాన్ని పండించింది. ఈ కవితా సంపుటిని సమీక్ష చేస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభాగం అధిపతి డాక్టర్ ఎం.సులోచన రచయిత్రి రాజ్యశ్రీ ఈ సంపుటిలో తన రచనను తల్లిదండ్రులకు నమస్కరిస్తూ ప్రారంభించడం ముదావహమన్నా రు. హిందూ ముస్లింల మధ్య సఖ్యత దైవ భ క్తి, మానవ జన్మ గొప్పతనాన్ని చాటుతూ రాజ్యశ్రీ ఈ కవితా సంపుటికి అందం తెచ్చారని సులోచన మెచ్చుకున్నారు. సాంస్కృతిక సంచాలకులు ఎం.కాంతారావు మాట్లాడుతూ, సమాజంలోని అనేక జాడ్యాలకు సాంస్కృతిక వికాసమే విరుగుడు అన్నారు. ఇలాంటి సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు సంతృప్తినిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కవితా సంపుటి రచయిత రాజ్యశ్రీని, ఆమె మాతృమూర్తిని నిర్వాహక సంస్థ పక్షాన ముఖ్య అతిథి అక్కినేని ఘనంగా సత్కరించారు. ఆరాధన కోశాధికారి వి.వి.రా ఘువరెడ్డి కార్యక్రమ పర్యవేక్షకుడి వ్యవహరించగా, రచయిత చిమ్మపూడి శ్రీరామమూర్తి గానం చేసిన ప్రార్థనా గీతం ప్రేక్షకులకు శ్రవణానందాన్ని కల్గించింది.

ధర్మవ్యాధోపాఖ్యానంలో మహాపతివ్రత సుశీల, పండితోత్తముడైన కౌశికుడికీ, ఈ విషయాన్నే సోదాహరణంగా బోధిస్తుంది. జీవనోపాధి కోసం అనేకులు అనేకానేకవృత్తులని చేపట్టవచ్చు. కాని వాళ్ళ ఆత్మైకతత్వాలు, మనోభావాలు, దృక్పథాలు, అభిరుచులు, ఆసక్తులు వేరుగా ఉండవచ్చు. ముఖ్యం గా కళాపిపాసువులు తమ రసార్తిని తీర్చు కోవటానికి ఒక వైపు వృత్తిపరంగా శ్రమిస్తూనే మరో వైపు మనః ప్రవృత్తిపరంగా సంగీతజ్ఞులుగా, రంగస్థలనటులుగా, కవులుగా, రచయితలుగా, తమ భావావేశాల్ని ప్రదర్శిస్తూ ఉంటారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సచివాలయం (సెక్రటేరియేట్) ఎంద

సమాజాన్ని చైతన్యవంతం చేయటం కోసం, ఉద్యోగులలో అంతర్నిహితమైన సామాజికస్పృహని వెలికితీయడం కోసం చేతన తన వంతు కృషి చేస్తూనే ఉంటుంది. 2007 మార్చి 8వ తేదీన ప్రపంచపర్యావరణదినోత్సవం నాడు, సెమినార్ నిర్వహించడం, మహిళాదినోత్సవసందర్భంలో గృహహింస చట్టం మీద సవివరమైన సమాచారం అందచేయడానికి శ్రీమతి కిరణ్‌బేడీ ఐపిఎస్‌ని ముఖ్య అతిథిగా ఆహ్వానించి, ఆమె చేతుల మీదుగా ఆ పుస్తకాన్ని ఆవిష్కరింపచేసిన చేతన కృషి ముదావహం.

సారస్వతసేవలో...

సాహితీసేవలో





# ఉద్యోగ పర్వంలో వినూత్న 'చేతన'

రెండరో మహానుభావులైన కళాకారులకి ఆలవాలమైంది. వాళ్ళందరూ మన మహత్తరమైన సంస్కృతికీ, నిత్యం పరిఢవిల్లే నాగరికతకీ నీరాజనాలిచ్చినవాళ్ళే. అటువంటివాళ్ళతో ఆవిర్భవించిన సచివాలయ సారస్వతవేదిక 'చేతన', 16 సంవత్సరాలుగా సచివాలయంలో సాహితీ వ్యాసంగం కొనసాగిస్తూనే ఉంది. మల్లెమాల వంటి మహనీయులైన కవులని కూడా సముచితంగా సత్కరించిన ఘనత, చేతనకే దక్కుతుంది.

**రసజ్ఞప్రపంచంలో...**

చేతన సారస్వతసంస్థ రెండు సంకలనాలని వెలువరించింది. ఇటీవల వెలువరించిన పుస్తకం చేతనాకథాఝరి. అంతకు ముందు కవితాచేతన అనే కమనీయమైన కవితాసంకలనం చేతన ద్వారానే వెలువడింది. సచివాలయంలో ఉద్యోగబాధ్యతలు నిర్వహించే కవులనీ, రచయితలనీ ఇతోధికంగా ప్రోత్సహిస్తోంది. అలా అనుక్షణం వాళ్ళకి రసజ్ఞలోకగౌరవాభిమానాలు దక్కుతూనే ఉంటాయి.

**సామాజికబాధ్యతగా....**

అంతర్భాగంగా, ప్రతి ఉగాదికీ కవిసమ్మేళనాలు నిర్వహిస్తూ వస్తోంది చేతన. 2007 సంవత్సరం మార్చి నెల 16వ తేదీన సర్వజిత్ నామసంవత్సర ఉగాది కవిసమ్మేళనంలో, సచివాలయం లోని జే బ్లాక్ కాన్ఫరెన్స్ హాలులో, సహజకవి మల్లెమాలని ముఖ్య అతిథిగా గౌరవించి నిర్వహించడం జరిగింది.

ఇలా ఎన్నెన్నో అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న చేతనకి సారథ్యం వహిస్తున్నవాళ్ళు, వృత్తిరీత్యా కూడా బాధ్యతాయుతమైన పదవులలో వున్నవాళ్ళే. చేతన గౌరవాధ్యక్షురాలు శ్రీమతి ఎస్. మాధవి అంతరంగికసేవలో ఉపకార్యదర్శి. అధ్యక్షురాలు శ్రీమతి ఎమ్. రాజ్యశ్రీ ప్రధానపరిపాలనశాఖలో సహాయకార్యదర్శి. ఉపాధ్యక్షురాలు శ్రీమతి శ్రీకృష్ణవేణి ప్రధానపరిపాలనశాఖలో విభాగాధికారి. కార్యదర్శి శ్రీ ఎమ్. ప్రసాద్. అదనపు కార్యదర్శి శ్రీ ఎమ్. రామనరసింహం. చేతన నిర్వహణలో చేస్తున్న కృషి ప్రశంసనీయం.

- శ్రుతకీర్తి

# పరిచయం

రాజ్యశ్రీ కవిత్వమొక రత్నాలమూట. అది ఒక రసధుని కవితలలో రాజ్యశ్రీ నవరసాలు పండించగల నేర్పరి. ఆమె గొప్ప భావుకురాలు. మాట సూటి, భావం మేటి. ఎటువంటి భావాన్నైనా నేర్పుగా నిర్మొహ మాటంగా చెప్పగలదు. అందుకే "మాటలోనే వృందిమర్మమంతా" అంటుంది. ఈ సంకలనంలో 60 కవితలున్నాయి. కొన్ని లఘు (మినీ) కవితలు. కొన్ని వచన కవితలు. కొన్ని ప్రకృతి వర్ణనలు. కొన్ని సందేశాత్మకాలు. ప్రకృతిని ప్రేమించే రాజ్యశ్రీ "పిచ్చి మొక్క"లని గూడా త్రొక్కనివ్వదు. ప్రక్కకు తిరిగి వెళితే "కృతజ్ఞతతో పాదాభివందనం చేస్తా" యంటుంది. ఎంత ఆర్ద్రత! అలా అని గట్టిగా చెప్పాల్సినచోట కవిత్వంతో చురకలంటించక మానదు రచయిత్రి. ప్రభుత్వ శాఖలో కీలక పదవిలో పనిచేసిన రాజ్యశ్రీ సర్కారు ఇచ్చిన మద్యం లైసెన్సులు విచ్చలవిడిగా ఉండటం, వల్లించే నీతిపాఠాలు, ఆరోగ్య సూత్రాలు చెప్పటం, "సన్నాయి నొక్కులు"లో ఎండగట్టింది. "ఖరఘోష" ఒక చక్కని పేరడీ. ఖరనామ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ "ఉత్తమ సేవా పథకానికి" గాడిద సరియైనదని సోదాహరణంగా నిరూపించింది. బాగానవ్విస్తుంది. "ఆకసమున హరివిల్లు విరిస్తే, అది మీకేననిసంబరపడే పిల్లల్లారా" అని శ్రీశ్రీ అన్నట్లుగా, రచయిత్రి బాల్యం గురించి చాలా హృద్యంగా వర్ణించింది. చెప్పలేని హాయిని కలిగించింది. రాజ్యశ్రీతో నాకు పరిచయం దాదాపు మూడు దశాబ్దాలు. ఆమె మంచి స్నేహశీలి. ఆమె పక్షులతో స్నేహం చేస్తుంది. చకోరపక్షులైతే మరీనయం. గాలితో స్నేహం చెయ్యగలదు. ఆకాశంతో స్నేహం చేసి ఊసులు చెప్పుకోగలదు. నవ్వుల

పువ్వులు కురిపించే రెండోహనీమూన్ చదవాల్సిందే. "కాదేదీ కవితకనర్హం" అన్నట్లు సిగ్నిల్ లైట్లు గూడా రాజ్యశ్రీకి కవితాస్ఫోరకాలే. కొన్ని బాధాకర సన్నివేశాలు గుర్తుకొచ్చినప్పుడు "కన్నీరు నాకొకవరం" అనీ, జీవితంలో "ప్రేమరాహిత్య" మైనపుడు కన్నీరు గూడా ఆవిరైపోయి దుఃఖంతో కళ్లు కాగి కన్నీరెండిపోవటం మనకు కంటతడిపెట్టిస్తాయి. ఇన్ని రసాలు కురిపించిన రచయిత్రికి శుభాభినందనలు.

"పుస్తకమంటే భయం" అంటున్న రచయిత్రి ఇప్పటికే చాలా పుస్తకాలు రాసింది. "తృప్తీ నీవెక్కడ?" తప్పక చదవాల్సిన పుస్తకం. చదవండి. చదివి నాలాగ ఆస్వాదించండి, ఆనందించండి.

డా॥ పి.యస్. మూర్తి
ప్రముఖ కవి, రచయిత &
విశ్రాంత సూపరింటెండెంట్,
నిలోఫర్ హాస్పిటల్

# సామాజిక స్పృహతో

# కేతవరపు రాజ్యశ్రీ సాహిత్యం

ఆరుపదుల్లోకి అడుగిడబోతున్నా... ఆరేళ్ళ అమ్మాయిలా తలలో నాలుకలా అందరితో ఎంతో కలివిడిగా వుంటారు కేతవరపు రాజ్యశ్రీ. "నేటి నిజం"కు నా రచన పంపాను మీకు నచ్చితే ప్రచురించమని ఎంతో వినమ్రంగా రాజ్యశ్రీగారు ఫోనులో మాట్లాడినపుడు మాట్లాడటం ఒక కళ అనే కంటే మాట్లాడటం ఆమె సంస్కారానికి నిదర్శనమని అనిపించింది.

జీవించడం వేరు, ప్రత్యేకతను సంతరించుకుని జీవించడం వేరు. మనం జీవించడంతోపాటు మన చుట్టూ వున్నవారికి జీవితాలను అవగాహన చేసుకోవడం కవికి వుండాల్సిన ముఖ్య లక్షణం. ఈ లక్షణమే మంచి కవిత్వాన్ని పండించడానికి వీలవుతుంది. ఈ దిశలోనే రాజ్యశ్రీగారి ప్రయాణం సాగుతోందని ఈ పుస్తకంలోని కవిత్వం చెబుతోంది.

"మీ ఇంటికి వస్తే ఏమిస్తావ్.. మా ఇంటికివస్తే ఏంతెస్తావ్" అనే ఆలోచనలో సమాజం మునిగితేలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో

"మల్లె వికసించడానికి పందిరి కావాలి
మనసు పంచుకోవడానికి ఒక నేస్తముండాలి
ప్రయాణాలు తరుగుతున్న సమాజంలో
స్వచ్ఛమైన స్నేహం ఎండమావే' నంటూ నిట్టూర్పు చెందడం

సహజమే.

ఆదాయాన్ని పెంచుకోవడంలోనే నిమగ్నమైతే
'క్షణం తీరికలేని సంపాదన
విశ్రాంతి తెలియని జీవన గమనం' ఎందుకని ప్రశ్నిస్తారు

రాజ్యశ్రీగారు,

ప్రజల ధన మాన ప్రాణాలను దోచుకుంటున్న వారు స్వేచ్ఛగా బ్రతకడం,

అమాయకులు వారి చేష్టలకు బలికావడం ఎంత వరకు

సమంజసమని

'అధికార పక్షంలాగే

నువ్వు కూడా వాళ్ళ కాపు కాస్తున్నావా? అని 'ఏమిటి చావులు?' కవితలో భగవంతున్ని ప్రశ్నిస్తే 'నాయకుడు వినాయకుడు కవితలో ప్రజా సంక్షేమం కోసం

'మా నాయకులకు నీలాగా

చాటంత చెవులనివ్వు

సమాజ అసమానతలను రూపుమాపడానికి

నీ అంత చిన్న నోరు నివ్వు

తక్కువ మాట్లాడి ఎక్కువ పనులు చేయడానికి' అంటూ

వినాయకున్ని వేడుకోవడం రాజ్యశ్రీగారిలో సామాజిక స్పృహ బలీయంగా వుందని చెప్పొచ్చు. అర్ధాంగితో అన్ని పనులు చేయించుకోవడమేగాని ఆమె ఆసరాగా ఏ ఒక్కపని చేయడని 'పురుష పుంగవుడు' కవితలో, భర్త కోసం

'ఎదురు చూసి చూసి

విసిగి వేసారిన ప్రాణం

పాన్పు చేరి కన్నీటి కడలయింది' అని

'ఎదురు చూపు' కవితలో కేరా స్పందనలు నిత్యం మనం చూస్తున్న కొన్ని కుటుంబాల యదార్ధగాథలు.

'యుగానికో అవతారమెత్తాడు

విష్ణుమూర్తి

రోజులో పది, అవతారాలెత్తుతుంది

మాతృమూర్తి' అంటూ 'ఆధునిక అమ్మ-ఆవిష్కరణ' కవితలో అమ్మ గురించి.

'నాన్నా ఇన్నేళ్ళుగా
నన్ను నడిపిస్తున్నది
నీ వారసత్వపు వ్యక్తిత్వ వికాసమే!

నా కన్నీటిలో మెరిసేది వెలకట్టలేని నీ జ్ఞాపకాలే! అంటూ నాన్న గురించి చాలా గొప్పగా చెప్పారు. అమ్మా నాన్నల అడుగుజాడల్లో పెరిగి వారి అపారమైన ప్రేమను రాజ్యశ్రీగారు పొందారనడానికి పై పంక్తులు నిదర్శనం.

అరవై కవితల్లో అక్కడక్కడా కొన్ని పంక్తులు బలహీనంగా వున్నా సామాజికాంశాలపై వీరికి పట్టు బాగావుంది. తెల్లకాగితం ఉందికదా అని కవిత్వం రాసినట్లు, ఖాళీ సమయంలో పాళీ కదిలించినట్టు కాకుండా మనసు పెట్టి మదిలో రగిలిన వాస్తవ ప్రతిబింబాలకు ప్రతిరూపాలే ఈ కవితలు, ఇపుడిపుడే సాహిత్యంలో పరుగులు తీస్తున్న కేతవరపు రాజ్యశ్రీగారు ఎంత రాశామని కాకుండా కొంతే రాసినా మరింత మంచి కవిత్వానికి ప్రాధాన్యతనిస్తారని ఆశిస్తూ...

**బైసా దేవదాస్**
సంపాదకులు, నేటినిజం దినపత్రిక

# ధన్యవాదాలు

"తృప్తీ నీవెక్కడ?" కవితా సంకలనానికి 'పరిచయం' అంటూ ముందు మాట రాస్తూ "రాజ్యశ్రీ ఒక రత్నాలమూట. కవితలతో రాజ్యశ్రీ నవరసాలు పండించగలనేర్పరి" అంటూ శుభాభినందనలు తెలియ చేసిన డా॥ పి.యస్. మూర్తిగారికి,

"మన చుట్టూ వున్నవారి జీవితాలను అవగాహన చేసుకోవడం కవికి వుండాల్సిన ముఖ్య లక్షణం. ఈ దిశలోనే రాజ్యశ్రీగారి ప్రయాణం సాగుతోందని" నన్ను ప్రోత్సహిస్తూ అభిమానిస్తూ.. 'సామాజిక స్పృహతో కేతవరపు రాజ్యశ్రీ సాహిత్యం' అని కితాబునిచ్చిన శ్రీ భైసా దేవదాసు గారికి,

నీ గురించి అంటూ స్నేహసౌరభాలను విరజిమ్ముతూ కవితరాసిన విశ్రాంత ప్రభుత్వ అదనపు కార్యదర్శి శ్రీమతి ఎస్. రమాదేవికి,

నా రచనలన్నిటికీ డిటిపి చేసిన శ్రీ కె. బాలకృష్ణకి,

నా కవితలను ప్రచురించి, ప్రోత్సహించిన పత్రికలు, ఆంధ్రప్రభ, నేటి నిజం, ముంబయ్‌వన్, ఆకాశక్, నవ్య, ఆంధ్రప్రదేశ్, సాహితీకిరణం, గౌరువాస్తు, సూర్య, రమ్య భారతి, చేతన, చినుకు సంపాదకులకు,

"ఊహల వసంతం" కవితా సంకలనానికి రాష్ట్రస్థాయి ద్వితీయ ఉత్తమ కవితా సంపుటి పురస్కారమందించిన సృజన సాహిత్య వేదిక అధ్యక్షులు శ్రీ దగ్గుపాటి రాధాకృష్ణగారికి,

ఈ పుస్తకావిష్కరణ కావిస్తున్న శ్రీ కిరణ్ సాహితీ సమాఖ్య అధ్యక్షులు, శ్రీ లంకా సుబ్రహ్మణ్యం గారికి కృతజ్ఞతలు.

నా నెచ్చెలి శ్రీమతి రమాదేవి అస్వస్థులుగా ఉన్నప్పుడు ఈ పుస్తకాన్ని ఆమెకు అంకితం యిస్తూ చూపించటం జరిగింది. పుస్తకావిష్కరణ సమయానికి ఆమె కీర్తిశేషురాలిగా మిగిలింది.

- రచయిత్రి

# ఇందులో...


1 పితృ వందనం
2 ప్రకృతితో స్నేహం
3 క్షరంలేని అక్షరాలు
4 తృప్తీ నీవెక్కడ!
5 హైదరాబాదులో ఆమని
6 ఆధునిక అమ్మ-ఆవిష్కరణ
7 రెండో హనీమూన్
8 కలుపు గులాబి
9 కన్నీటి లేపనం
10 సాతంత్రం లేని బతుకు
11 ఆర్తి
12 ఒంటిస్తంభం మేడ
13 ప్రేమ రాహిత్యం
14 ఉరి
15 పరిపూర్ణ మహిళ
16 కమ్మని భావం
17 ఆత్మీయత
18 మా తాతలు నేతులు తాగారు
19 చల్లని పలకరింపులు
20 ఏమిటీ చావులు?
21 నాయకుడు వినాయకుడు
22 ఎదురుచూపు
23 దాహార్తి
24 ప్రతి గుండె నినదించాలి
25 పురుషపుంగవుడు
26 అభినేత్రి
27 ఒంటరి
28 కాలగమనం
29 ఎక్కడికెళ్ళావురా కన్నా
30 ఉరి తీసి ఊపిరి
31 పుస్తకమంటే భయము
32 అనుకోని అతిథి
33 సమన్వయం
34 కోతి మనసు
35 సన్నాయి నొక్కులు
36 ఎగిసిపడే అల
37 మీడియా
38 గడసరి తొలకరి
39 అక్షరం
40 కత్తి మీద సాము
41 ఎంతమందో
42 అతనికంటే ఘనుడు
43 స్వాంతన
44 కాపురానికి వలస
45 ట్యాంకుబండ్ మీద అపురూప దృశ్యాలు
46 వెన్నెల కళ్లాపి
47 గడ్డి మొక్క
48 ఖరఘోష
49 అవ్యక్తం
50 గులాబిసౌరభం
51 అశాంతి
52 బురఖా
53 చకోర పక్షులు
54 ఒక్కసారి ఆలోచించండి
55 ఆల్బమ్
56 చెప్పలేని హాయి
57 మనసుకు తాళం
58 మాటేమంత్రం
59 వంకర టింకర
60 మధురం

# పితృవందనం

కాలం మంచు తెరల్లోంచి
అరలు అరలుగా
పేర్చుకున్న
స్మృతి దీపాలు

నీ చెప్పులో నా బుల్లి పాదాలు
ఇమడ్చలేక పడబోతుంటే
నీ చేయి వూతమిచ్చి పట్టుకున్న గురుతు

కొత్త పలక చేతికిచ్చి
బడిలో మాష్టారుకి అప్పచెప్పినప్పుడు
బెంగతో నీ చేయి
గట్టిగా పట్టుకున్న గురుతు.

నా బంగారు తల్లి పెద్ద చదువులు చదివి
నాకు పేరు తెచ్చి పెడుతుందని బుజ్జగిస్తూ
వెన్ను చరిచి ధైర్య మిచ్చిన గురుతు
అదే నా విజయలకు తొలిమెట్టు.

నీ చిటికెన వేలు పట్టించి నడిపిస్తూ
సాహితీ సౌరభాల గుబాళింపు అంటించావు
నాలో నిగూఢంగా వున్న సాహితీ పిపాసకు
కరదీపిక అయింది ఈనాడు.

అల్లంత దూరాన నీ అడుగుల సవ్వడి
నా చేతిలో పుస్తకరూపం దాల్చేది
నా కాళ్ల మీద నేను నిలబడగలిగే
ఆత్మస్థైర్యానికి అదే అయింది పునాది.

అక్షర యానంలో అహరహం శ్రమించి
విశ్రాంతి అంటే రోజూ చేసే పనికి
భిన్నంగా  చేసేదని నిర్వచనం చెప్పి
ఆశయాల నిచ్చెనలు ఎక్కించావు.

అనారోగ్య అంపశయ్య మీద
పండుటాకులా పడుకుని కూడా
జీవిత కాలపు ప్రేమ రాహిత్యాన్ని
నీ ఆర్ద్ర దృక్కులతో మటుమాయం చేశావు.

పరాత్పరుడి పిలుపుతో
తనువు చాలించినా
ప్రతి పనిలో నీదైన ముద్రవేసి
నా జీవితానికి దిక్సూచిగా నిలిచావు.

భావావేశంతో బరువై
మాటలకందని కృతజ్ఞతా పదాలను
నా ఎదపై
చిత్రాలుగా గీశాను

నాన్నా! ఇన్నేళ్లుగా
నన్ను నడిపిస్తున్నది
నీ వారసత్వపు వ్యక్తిత్వ వికాసమే!
నా కన్నీటిలో మెరిసేది
వెలకట్ట లేని నీ జ్ఞాపకాలే!

*(జి.వి.ఆర్. ఆరాధన వారు నిర్వహించిన పితృవందనం కార్యక్రమంలో మా తండ్రిగారికి నివాళిగా చదివిన కవిత)*

# ప్రకృతితో స్నేహం

మల్లె వికసించడానికి పందిరి కావాలి
మనసు పంచుకోవడానికి ఒక నేస్తముండాలి
ప్రమాణాలు తరుగుతున్న సమాజంలో
స్వచ్ఛమైన స్నేహం ఎండమావే.

అందుకే!
తొలకరిజల్లుకు పులకించి
వెదజల్లిన మట్టివాసన ఆస్వాదిస్తూ
భూమాతతో చేశాను స్నేహం

ఉషోదయాన సన్నని తుంపరలో
పచ్చని చేలవెంబడినడుస్తూ
కిలకిలరాగాలాపనచేస్తున్న పక్షులతో
చేసాను స్నేహం

చుక్క చుక్క చినుకుపడి
మడిచేలు తడిసి మురిసి
మొలకెత్తిన పైరుతో
చేసాను స్నేహం

పూలతోట మీదుగా వీచి
పరిమళం మోసుకొచ్చి
హాయిని పంచిన గాలితో
చేసాను స్నేహం

పగటి కాంతి పడమటికి కుంగిపోతున్నా
గూటికి చేరే పశు పక్ష్యాదులకు
సంధ్య వెలుగులతో దారి చూపే
ఆకసంతో చేసాను స్నేహం

మనిషి మనుగడను
ఆహ్లాదభరితం చేస్తున్న
ప్రకృతితో నా స్నేహం
స్వచ్ఛమైన నిత్య నూతన పరిమళం.



కేతవరపు రాజ్యశ్రీ

# క్షరం లేని అక్షరాలు

క్షరం లేని అక్షరాలు
మోస్తున్న నిండు గర్భిణి
పుస్తకం
ప్రసవించగానే కొన్ని అక్షరాలు
కిలకిల నవ్వుతాయి
కొన్ని గలగల మాట్లాడుతాయి
మరికొన్ని భాష్పాలు రాలుస్తాయి
కొన్ని అక్షరాలు
జీవిత లక్ష్యాలకు గవాక్షాలు తెరుస్తాయి
మరికొన్ని విజ్ఞానపు అంచులు చూపిస్తాయి
కొన్ని అక్షరాలు ఆత్మీయంగా పలకరిస్తాయి
మరికొన్ని
ఒంటరితనంలో తోడుగా వుంటాయి
కొన్ని ఆధ్యాత్మికతను అలవరుస్తాయి
మరికొన్ని పరమాత్మను చేరే
మార్గం చూపిస్తాయి
నవరసాల నవనవోన్మేషణాన్ని
నిశ్శబ్దంగా మనిషి
మస్తిష్కంలో ఎక్కించి
మనోవికాసాన్ని కలిగిస్తూ
పరోపకారచింతనే
పరమావధిగా భావిస్తాయి
క్షరంలేని అక్షరాలు
చదివి చేసుకుందాం
జీవితాన్ని అర్థవంతం.

*('నేటినిజం'లో ప్రచురింపబడిన కవిత.)*

# తృప్తీ నీవెక్కడ!

ఆగర్భ శ్రీమంతుడిని
ఖరీదయిన కార్లూ బంగళాలు
అడుగులకు మడుగులొత్తే
నౌకర్లు చాకర్లు
సిరిసంపదలతో అడుగిడిన భార్య
తండ్రిగా పదోన్నతి కల్పించిన పిల్లలు
వ్యాపారంలో పట్టిందల్లా బంగారం
వడ్డించిన విస్తరి నా జీవితం
అయినా
మనసు మారుమూల పొరల్లో
ఏదో తెలియని అసంతృప్తి
ఇంకా ఏదో సాధించాలనే ఆరాటం
వ్యాపారసామ్రాజ్యం విస్తరించి
సార్వభౌమాధికారి కావాలని తహతహ
ఆ దారిలో
గులాబీల సౌరభంతోపాటు
ముళ్లెన్నో గుచ్చుకున్నాయి
క్షణం తీరిక లేని సంపాదన
విశ్రాంతి తెలియని జీవన గమనం
అలసిన తనువు మనసు
సేద తీరాలని మొరాయించాయి
ఒయాసిస్‌లాంటి ఇల్లు గుర్తుకొచ్చింది
వడివడిగా గృహోన్ముఖుడినయ్యా
హర్షాతి రేకంతో పరుగున వచ్చి
కాళ్లను పెనవేసుకున్నారు చిన్నారులు

ఆత్రుత ఆత్మీయత కలబోసి
పలుకరించాయి ఆలి కనుదోయి
ఆమె ఒడిలో తలనిడి నంతనే
ప్రేమగా తలనిమురుతూ
స్వాంతన కలిగించింది
మటు మాయమయింది
నా అలసటంతా
నా కింతవరకు అనుభంలేని
ఒక ప్రశాంతత
మనసెంతో సంతృప్తిగా హాయిగావుంది
జీవితంలో నేసాధించిన
విజయాలన్నిటికన్నా
నేననుభవించిన ఈ తృప్తి
తులసి దళమల్లె తూగి
విజేతగ నిలిచింది.

*(డిసెంబరు 2010 "నవ్య" వీక్లీలో ప్రచురితం)*

# హైదరాబాదులో ఆమని

మావి చిగురల రుచి చూసి
వసంతాన్ని గ్రోలి
ప్రకృతి శోభను తనువంతా అద్దుకుని
కొంగ్రొత్త ఆశలను నింపుకుని
పెళ్లికూతురులా ముస్తాబయి
పట్నం చూడాలని
కొండలు, కోనలూదాటి
నగరానికొచ్చిందొక కోయిల
మిరుమిట్లుగొలిపే లైట్ల కాంతిలో
ధగధగ మెరిసిపోతున్న హైదరాబాదును చూసి
పరమానందం చెందింది
జన్మధన్యమయిందనుకుంది
ఎంత అదృష్టవంతురాలీ, నగర కోయిల
అని రవంత ఈర్ష్యపడింది
మరునాడు
శాసన సభా సమావేశాలు చూద్దామని
పరుగు పరుగున వచ్చింది
వాగ్బాణాలు, ముష్టి ఘాతాలు, గుచ్చుకుని కలవరంచెందింది
టాంక్ బండ్ అందాలు తిలకిద్దామని
వడివడిగా అరుదెంచింది
విగ్రహాల విధ్వంసానికి మూగసాక్షియై
గౌతమ బుద్ధుడు వెలవెల బోతున్నాడు
కుత్తుక ఎండి హుసేన్‌సాగర్‌లో నీరుతాగుదామనుకుంది
బురద నీటితో గొంతు బొంగురపోయింది
క్షుద్బాధకోర్వలేక, మావి చిగురు కానరాక
ఇంటి ముంగిట కట్టిన

మామిడి తోరణాలు ఆబగా ఆరగించబోయింది
పచ్చని ప్లాస్టిక్ ఆకులు గొంతులో గుచ్చుకుని
దేవుడా నీవే దిక్కు అంటూ పైకి చూసింది
ఆకసాన్ని మింగేసిన బహుళ అంతస్తుల మేడలు
పచ్చదనాన్ని మసిచేస్తున్న
కాలుష్యపు కోరలు
ఖాకీల పదఘట్టనలతో
దద్దరిల్లుతున్నది నగరం
కళ్లు గిరగిర తిరిగి
దబ్బున నేల మీద పడింది
మండుటెండలకు మాడి మాడి
భూమాత వడి సెగలు కక్కుతున్నది
కుత్తుక బిగిసిపోతున్నది
పట్నమెళ్ళద్దు బిడ్డా అని పెద్దలు చెప్పిన మాట
పెడచెవిన పెట్టిన ఫలితమిదని
వెక్కివెక్కి ఏడ్చింది
స్వచ్ఛమైన సెలయేటి నీటి తీయదనం
మామిడి చిగురుల కమ్మదనం
మల్లెల చల్లదనం కోసం
వెదుకుతూ వెదుకుతూ
జనారణ్యంలో తప్పిపోయింది
చిన్నారి కోయిల
కాదు కాదు
హైదరాబాదులో ఆమని.

*(వంశీ ఇంటర్‌నేషనల్ వారు ఏప్రిల్ 2011 నిర్వహించిన కవిసమ్మేళనంలో చదివిన కవిత)*

# ఆధునిక అమ్మ-ఆవిష్కరణ

అమ్మను ఎన్నికోణాల్లో
ఆవిష్కరించినా ఇంకా
కొరత మిగిలే వుంటుంది
పొద్దుపొడుపుతో
నిద్దురలేచే అమ్మ
ఎత్తే అవతారాలెన్నో!
చిన్నోడు లేచి ఆరున్నొక్కరాగం
తీసేలోపల
పాల పేకెట్‌కోసం పరుగుతో
అవతారాల పర్వం మొదలు
ఇల్లూవాకిలి శుభ్రంచేసుకుని
గిన్నెలూ బట్టలూ తళతళలాడించే
పనిమనిషి
ఘుమఘుమలాడిస్తూ వండివడ్డించే
వంట మనిషి
స్కూల్ యూనిఫామ్ ఇస్త్రీ చేసి
రెడీచేసే ఐరన్ మనిషి
చిందరవందర చేసిపోయిన
ఇంటిని అందంగా తీర్చిదిద్దే
ఇంటీరియర్ డెకరేటర్
దెబ్బలాడుకుని ఏడుస్తున్న పిల్లల్ని
ఆటల్లో అరటిపండని
సముదాయిస్తూ

ఫస్ట్ ఎయిడ్ చేసే డాక్టరు
పక్కనకూచుని తప్పులులేకుండా
హోమ్‌వర్క్ చేయించే టీచరు
చీకటిపడుతూనే
సుద్దులు చెబుతూ
ప్రేమను రంగరించి కలిపిన
ముద్దలు తినిపించే అన్నపూర్ణ
ఆప్యాయంగా తలనిమురుతూ
వీరుల కథలు వినిపిస్తూ
నిద్రపుచ్చే వీర వనిత
అలుపెరగని ఆప్యాయతకు
ప్రతిరూపం అమ్మ
యుగానికో అవతారమెత్తాడు
విష్ణుమూర్తి
రోజులో పదిఅవతారాలెత్తుతుంది
మాతృమూర్తి
అందుకే
అమ్మకు పర్యాయం
సృష్టించలేకపోయాడు
బ్రహ్మ.

*(మే 2011 "ఆంధ్రప్రదేశ్" మాసపత్రికలో ప్రచురితం)*
*(జి.వి.ఆర్. ఆరాధన నిర్వహించిన మాతృవందన*
*కవిసమ్మేళనంలో చదివిన కవిత.)*

# రెండో హనీమూన్

వార్తలు విందామని
టి.వి. ముందర కూర్చున్నాను
రెండు రెక్సోనా సబ్బులు కొనండి
రెండవ హనీమూన్‌కి వెళ్ళండి
అబ్బ! వార్తల మధ్యలో కూడా
ప్రకటనలేనా అని విసుగొచ్చింది
ఎక్కడ నుండి ఊడి పడ్డారో
పిల్లలిద్దరూ ముక్త కంఠంతో
నాన్నా! హనీమూన్ అంటే
ఏమిటీ? అనడిగారు
బిత్తరపోయి ఏంచెప్పాలా
అని నీళ్లు నములుతుంటే
ఏం చెపుతానా అని
కొంటెగా నా వైపు
చూసింది శ్రీమతి
"హనీమూన్" అంటే
అదో 'జాలీ' ట్రిప్ అన్నాను
చాలా బాగా చెప్పానని
శ్రీమతి వైపు గర్వంగా చూశా!
అంటే మాకు చెప్పకుండా
ఇంతకుముందే మీరు
జాలీ ట్రిప్ కెళ్లొచ్చారన్నమాట
మేం వూర్కోము.
ఈసారి అందరం కలిసి రెండోసారి
హనీమూన్ కెళ్లాల్సిందే

బాల్ బౌన్స్ అయి నాకే తగిలింది
అప్పటికప్పుడు బజారుకెళ్ళి
రెక్సోనా సబ్బులు కొనేదాకా
వూరుకోలేదు పిడుగులు
మరునాడు ఆఫీసు కెళ్ళగానే
రెక్సోనా వాళ్లకి ఫోన్ చేశా
మేమిద్దరం హనీమూన్ నుంచి
తిరిగొచ్చేదాకా
మా పిల్లల్ని మీ దగ్గరుంచుకుంటారా
అని కసి తీరా అడిగా!
తెల్లమోహం
వేసుంటాడు వెధవ!

(నవ్వులు పువ్వులు హాస్య కవితా పోటీల్లో రెండవ బహుమతి పొందిన కవిత)

# కలుపు గులాబి

ఇంటి మొత్తంలో
నాకు చాలా ఇష్టమైన చోటు
మా వాకిలి అరుగు
ఉషోదయాన దాని మీదకుచేరి
పిల్లతెమ్మెరలు మేస్తూ
వేడివేడి కాఫీ చప్పరిస్తూ
వార్తాపత్రిక విశేషాల వెంబడి
కనులు పరుగుతీస్తుంటే
చెప్పలేని హాయి అనుభవిస్తుంటాను
ప్రతి రోజూలాగే
సింహాసనంలాంటి అరుగుమీద
ఆసీనుడిని కాబోతుండగా
గట్టు పగుల్లో నుంచి
చిన్న కలుపు మొక్క తొంగిచూసి
గుడ్‌మార్నింగ్ అంటూ పలకరించింది
అరే! నా ఆనందం పంచుకోవడానికి
ఇంకో ప్రాణి కూడా వచ్చిందే అనుకుంటూ
చిరునవ్వుతో దానికి బదులిచ్చాను
దినదిన ప్రవర్థమాన మవుతున్న
ఆ మొక్కను పలకరించి
వార్తా పత్రికలో తలదూర్చడం
నా దిన చర్యలో భాగమయింది
పేపరు చదవడం పూర్తికాగానే
దానికి కాసిన నీళ్లు తెచ్చి పోద్దామని
రోజూ అనుకుంటా!
కానీ ఆ అరగంటసేపు మాత్రమే
నా కోసం నేను కేటాయించుకున్న టైమ్
లోపలికెళ్లగానే
సంసారబంధాల పెనవేతతో
దాని సంగతే గుర్తుకురాదు
ఆరోజు

అలవాటుగా ఆ మొక్కను
పలకరిద్దామని చూసేసరికి
చూపుడు వేలంత ఎదిగిన
ఆ మొక్క కొనభాగాన
మంచుబిందువులతో తడిసి
స్నిగ్ధమనోహరంగా వున్న
గులాబిరంగు చిన్నపూవు
శుభోదయం అంటూ పలకరించిఁది
వేలెడంతలేని ఈ మొక్కకి
ఈ పూవెలా పూసింది?
అని సంభ్రమాశ్చర్యాలకు లోనయి
ప్రతిస్పందించడం మరిచి
కళ్లు విప్పార్చుకుని
ఆనందంగా దాని వంక చూశా!
మనసు మారుమూల ఏదో గిల్టీ ఫీలింగ్
ఏనాడూ చుక్క నీరు పోయని నాకు
ఎంత ఆనందాన్ని పంచుతోంది ఈ మొక్క
నా మనసులో మాట పసికట్టినట్టుంది
ఆ గడుగ్గాయి పిసరంతపూవు
"ఏంటోయ్!' నువ్వు పోసే నీటిచుక్కకోసం
అంగలార్చుకుంటూ కూచుంటే
ఈ భూమ్మీద చెట్లే వుండవు
రాతిలో కప్పకు నీరందించినాడు
నాకందిచలేడా!
నేనెవరికీ పనికిరాకున్నా
పరోపకార బుద్ధితో
స్వచ్ఛమైన ప్రాణవాయువు నీకందిస్తూ
పర్యావరణ పరిరక్షణకోసం
నావంతు కృషిచేయడానికి పుట్టాను నేను
అంటూ నన్ను వెక్కిరిస్తూ ఓదారుస్తున్నట్టుగా
నిటారుగా ధీమగా నావంక చూసింది
ఆచిన్ని కలుపుగులాబి.

*(ఆంధ్రప్రభలో ప్రచురితం)*

# కన్నీటి లేపనం

కన్నీరు నాకొక వరం
శబ్ద రహితంగా
బాధను బహిర్గతం చేసి
మనసు తేలిక పరచే లేపనం

ఆత్మజను అల్లుడికి అప్పగిస్తున్నప్పుడు
కొంగును నోటికి అడ్డంపెట్టుకుని
కళ్లతో ఆలపించిన
ఆనంద విషాదాల మౌనరాగం

ఉన్నత విద్యాన్వేషణలో పుత్రుడు
విదేశాలకు పయనమవుతుంటే
ఉబికివస్తున్న ఉద్వేగాన్ని
ఉపశమింపచేసిన దివ్యౌషధం.

ఒంటరి తనపు
వ్యధాభరిత హృదయాన్ని
నిశ్శబ్ద జలపాతమై
స్వాంతన పరచిన చల్లని నేస్తం.

కన్నీరు నాకొక వరం
మనసు తేలిక పరిచే లేపనం.

# సొతంత్రం లేని బతుకు

పెయ్యిలోని పానమంతా
పొలంకాడ ఆవిరయిపోనాది
పోరలు ఆకలితో ఆగమయితుంటరని
గబగబలాడుకుంటా
గుడిసెకాడికి లగెట్టు కొచ్చా
గంజికాసి పోసినంక సల్లబడ్డారు పిల్లోల్లు
ఒల్లు బగబగలాడుతుంది
పనికాడ ఎకిలిసూపులు సూత్తరని
నిండాపైట సుట్టుకుని
ఉడకపోత బరాయించుకున్న
గొయ్యిలాంటి నులక మంచంలో
పెయ్యిని దిగేశా
పిసరంతగాలి తొయ్యక
కొంగుతీసి పంకాలా ఇసరకుంటన్నా
యాడనించొచ్చాడో
కల్లుకంపు కొట్టుకుంటా
వంకర్లుబోతావచ్చి
ఆబగా నా గుండెల్ని సూత్తన్నడు
తాగుబోతునాయాలు
ఆని ఎకిలి సూపులకు
పోకిరి సేట్టలకు
వల్లంతా కంపరమై పోనాది
ఏలాపాలాలేని వాడి సరసానికి
రస్తా అయింది నామెల్లో తాలి
ఛీ! రోత పుట్టినాది
ఆడజలమ మీద
కూసింత తొంగుండనీకి కూడా
సొతంత్రం లేని బతుకుమీద.

# ఆర్తి

పుస్తకావిష్కరణ సభకు
మిత్రుల ఆహ్వానం మీద వెళ్ళడం
కొత్త కొత్త పుస్తకాలు ఇంటికి తెచ్చుకోవడం
నాలోని కవితా ఆర్తికి
కొంత ఉపశమనంగా వుండేది
పుస్తక ముఖ చిత్రం వైపు చూపు నిలిపి
మృదువుగా వాటిని తడిమి చూసుకునేదాన్ని
ఇల్లంతా నాదే అయినా
ఈ పుస్తకాలు పెట్టుకోవడానికి
ఇంట్లో నాకంటూ ఒక చోటు లేదు
పెరుగుతున్న పుస్తకాల దొంతరాలను చూసి
చదవడానికి సమయం చిక్కక
నా పెదవులపై విషాద దరహాసం
చివరికి వంటింటి డబ్బాలను
ఓ పక్కకి జరిపి కొన్ని పుస్తకాలు సర్దాను
కుక్కర్ కూత వచ్చేలోపల
ఓ పుస్తకాన్ని ఆర్తిగా తెరిచాను
నా భావోద్రేకాలకు అద్దంపడుతూ
అది ఒక కాంతి వలయంలా
నన్ను చుట్టు ముట్టింది
నా అంతరంగాన్ని
అక్షర జ్యోతులతో వెలిగించింది.

*(విశ్వసాహితి కవిసమ్మేళనంలో చదివిన కవిత)*

# ఒంటిస్తంభం మేడ

నాలుగు కూడళ్ల రహదారిలో
దర్జాగా నిలుచున్న ఒంటి స్తంభం మేడ
మేడపై నుండి కన్నెర్ర చేసి చూసి
ఎంతటి వాళ్లనయినా
గీసిన గీటు దాటనీయదు
కొంత తడవుకి శాంతించి
మనసుకి కాస్త బంగరు రంగు అద్దుకొని
భయపడకండి
పయనానికి సిద్ధముగా వుండమని
సముదాయిస్తుంది
అటు ఇటుచూసి
ఎవరూ అడ్డులేరు
ప్రయాణం బాగా జరుగుతుంది
బయలుదేరండని
పచ్చగా దీవించి పంపుతుంది
అదే! ప్రమాదాలు నివారించి
మన ప్రాణాలకు భద్రత కల్పించే
సిగ్నల్ లైట్.

*("నేటి నిజం" లో ప్రచురింపబడిన కవిత)*

## ప్రేమ రాహిత్యం

ప్రేమ రాహిత్య జీవనంలో
ఏళ్ళకి ఏళ్ళు
గడిచిపోయాయి
పిసరంత
ప్రేమ కోసం
తపించి
గుండె ఎడారయింది
బండ బారిన మనసు
బరువు దింపు కుందామంటే
కన్నీటికి కూడా
కనికరం లేకపోయింది
కరువు తీరా ఏడిచి
ఎంతకాలమయిందో?

## ఉరి

చెట్లు
ఉరివేసుకుని
బహుళ అంతస్తుల
భవనాలకు ఊపిరిపోసాయి.

కొవ్వొత్తి
తాను కాలిపోతూ
అంధకారాన్ని మింగేసి
వెలుగు దారి చూపుతుంది

తన డొక్క మాడ్చుకుని
పిల్లల భవితకు
పునాదులేస్తున్న
అమ్మలాగ.

# పరిపూర్ణ మహిళ

హృదయమా! నీకు జోహార్లు
ఎన్నోమార్లు
నా మనసుకైన గాయాలకు
మైపూత పూసే సలహాలనిచ్చి
ఓదార్పునిచ్చావు

బాధ్యత మరచి తప్పతాగి
నన్నూ, నా పుట్టింటినీ
నోటికొచ్చినట్లు తూలనాడుతుంటే
సంసారగుట్టు రట్టు చేసుకోక
ఓర్పువహించమని బుజ్జగించావు

తన పొరపాటును
నాదిగా చిత్రీకరిస్తూ
పై అధికారి దూషిస్తుంటే
మౌనాన్ని భూషణంగా ధరించి
తలదించుకోమన్నావు

కొంగుపట్టి నడిచిన కొడుకు
నా నీడను శాసిస్తుంటే
లోకం పోకడ అర్థంచేసుకుని
కాలానుగుణంగా
సర్దుకు పొమ్మన్నావు

ఆసరా అవుతుందనుకున్న కోడలు
మంచం మీదకు కంచం అందించమన్నపుడు
వేరు కాపురం పెట్టి
నిన్ను రచ్చకీడ్చకుండా
పరువు దక్కించుకోమన్నావు

మండే గుండెను
జారే కన్నీళ్లలో చల్లార్చి
వ్యక్తిత్వాన్ని సమాధి చేసి
అన్నిటికీ గొర్రెలా
తలవూపాను

అందుకే ఈనాడు
ఇంటా బయటా
అందలమెక్కిస్తున్నారు
నన్ను
పరిపూర్ణ మహిళగా!

## కమ్మని భావం

అలసిన మేను
నడుమువాల్చగానే
మదిలో మెదిలింది
కమ్మని భావం
కాగితం మీద పెడదామంటే
కనులు అరమోడ్పులై
మనసున పదిలపరుచుకుని
సుషుప్తిలోకి జారాను
కోడికూతకు
మెలుకువరాగానే
యాంత్రిక బాధ్యతల
నడుమ
ఆ కమ్మని కవిత
కనుమరుగైంది

## ఆత్మీయత

ప్రతి పని
ఏదో ఒక
ప్రతిఫలాపేక్షతోనే
చేస్తాము
దానికి
కాస్త
మానవీయత
జోడిస్తే
ఆత్మానందం
కూడా
జత అవుతుంది.

# మా తాతలు నేతులు తాగారు

ఇంటి బెల్లు కొట్టగానే
టీచరు కీచకుడుగ మారె
డ్యూటీ దిగిన పోలీసుకి
దొంగ తనం హాబీగా మారె
సమాజం కుళ్ళిపోయి
కులాల కుంపటాయె
చట్టాలు అయినవాళ్ళకు
చుట్టాలుగా మారె.
ఆధిపత్య పోరుతో
ఒకే ఇంట నాలుగు పార్టీలాయె
వరకట్నం రూపుమారి
లాంఛనంగ అవతారమెత్తె
చదువుకుందామన్న అతివలపై
యాసిడ్ దాడులాయె
ఏ రోడ్డు చూసినా
గుంటలు, గోతులాయె
అపార్ట్‌మెంట్ల నిర్మాణం
చెట్లను నేల కూల్చెనాయె
అశోకుడు చెట్లునాటెను
రోడ్లు వేసెనని చదివితిమాయె
మా తాతలు నేతులు తాగారని
చరిత్ర తలచుకొని
గర్వపడుటయే కాని
వర్తమానం కడు
భయంకరమాయె.



కేతవరపు రాజ్యశ్రీ

# చల్లని పలకరింపులు

నిటారుగా
నిలబడలేని
వెన్నుపూసలు
నేలకు అతుక్కున్న
మసకబారిన చూపులు
సుఖ దుఃఖాలకు
పొంగి కృంగిన
ఎముకల గూళ్లు
బిడ్డల సాయం మృగ్యమై
కర్ర సాహచర్యంతో
కాలం గడుపుతున్న
ముదుకాళ్ల ముదుసలులు
తమ అనుభవసారం
రంగరించి
ఎందరికో
ఆరోగ్యాన్ని
ప్రసాదించిన
ధన్వంతరీలు
అస్వస్థత కలిగినప్పుడు
మందుల కోసం కాదు
చల్లని పలకరింపుల కోసం
పలవరిస్తున్నారు.

# ఏమిటీ చావులు?

ఏమిటీ చావులు భగవాన్
ముక్కు పచ్చలారని బాలుడు
స్కూలు బస్సుకిందపడి మరణం
మెడిసిన్ చదువుతున్న ఏకైక పుత్రరత్నం
రోడ్డు ప్రమాదంలో దుర్మరణం
కట్నం కోసం భార్యను నిప్పంటించి
నిండు ప్రాణాన్ని బలికొంటున్న వైనం
వాటాలు పంచివ్వమంటూ
తల్లిదండ్రులను హతమారుస్తున పచ్చినిజం
రోగాలతో రొష్టులతో
చూసే దిక్కులేక
చావు కోసం ఎదురు చూస్తున్న
పండు ముసలికి మాత్రం చేస్తావు నూరేళ్ళ ఆయుషు
నీ సొమ్మును కాజేస్తున్న వారికీ
ప్రజాధనం కొల్లగొడుతున్న వారికీ
దోపిడీలకు పాల్పడుతున్న వారికీ
చావు బహుదూరం
అధికార పక్షంలాగే
నువ్వు కూడా వాళ్లకాపుకాస్తున్నావా?
భగవాన్!

# నాయకుడు వినాయకుడు

ఉషోదయాన
ఉత్సాహంగా
వార్తాపత్రిక తెరవగానే
రక్త మోడుతున్న రహదారులు
ప్రమాదాల్లో చితికిపోయిన శరీరాలు
సంఘ విద్రోహశక్తుల
కుయుక్తుల కథనాలు
చిన్నారులను చిదిపివేసిన
మానవ మృగాలు
గుండెలు బాదుకుంటున్న
బంధువుల రోదనల దృశ్యాలు
బ్రతుకు భయంతో
విలవిల లాడుతున్న సామాన్యుడు
అన్యాయాలు అరాచకాలు
దోపిడీలు, కబ్జాలు
వగైరావగైరా
ఉత్సహమంతా నీరుగారింది
మనసు వికలమయింది
దేశమేమయిపోతుంది
ఎప్పుడు వీటికి అంతం
ప్రజల బాగోగులు పట్టించుకునే
తీరికలేదు నాయకులకు
అంతర్గత కుమ్ములాటలతో
తమ పదవిని కాపాడుకునేందుకు
చూపించే ఓర్పు నేర్పు
సామాజిక సమస్యల పట్ల
చూపించే నాయకులే కరువయ్యారు
ఆవేదన భరిత హృదయంతో

సంకష్టహరుడైన
విఘ్నాతిపతిని
స్మరించా
హే! వినాయకా!
మా నాయకులకు నీలాగా
చాటంత చెవులనివ్వు
ప్రజలగోడు వినేందుకు
నీ అంత సూక్ష్మ దృష్టినివ్వు
సమాజ అసమానతలను
రూపుమాపడానికి
నీ అంత చిన్ననోరునివ్వు
తక్కువ మాట్లాడి
ఎక్కువ పనుల చేయడానికి
హేగణాధిపా!
గడ్డి పరకకు విలువనిచ్చి
పూజార్హత కల్పించినట్లే
మా నాయకులకు
సామాన్యుడి విలువ తెలిసేలా చేయి
పరస్పర వైరం కలిగిన
సర్పమూషికాలను నీ చెంత
చేర్చినట్లే
వర్గవైషమ్యాలు సృష్టించక
మనుషులందరినీ
ఒక్కత్రాటిపై నడిపించమని
మా నాయకులకు
హితము తెలియచేయి
అని వేడుకున్నాను
మనసుకు కొంత
వూరట లభించింది.

*(వినాయక చవిత పండుగ పురస్కరించుకొని 'చేతన' నిర్వహించిన కవిసమ్మేళనంలో చదివిన కవిత)*

## ఎదురుచూపు

అతడికి ఇష్టమైన
వంటకోసం
తనువు వంటింట్లో
అతడి రాక కోసం
మనసు కనులు
వాకిట్లో
ఎదురుచూసి చూసి
విసిగి వేసారిన ప్రాణం
పాన్పుచేరి
కన్నీటి కడలయింది.

## దాహార్తి

కాలుష్యపు పొగతో
తనకు పూపిరాడకుండా
చేసినా
మసకబారిన కంటి
కన్నీరునే
స్వచ్ఛమైన జలధారలుగా
కురిపించి
నరుడి దాహార్తి తీరుస్తుంది
మేఘం
హాలాహాలం మింగి
జగతిని రక్షించిన
నీలకంఠుడిలా!

# ప్రతి గుండె నినదించాలి

ఇవాళ మనం గుండె మీద చేతులు వేసుకుని
కంటినిండా నిద్ర పోతున్నామంటే
కంటిరెప్ప వేయకుండా సరిహద్దును
రక్షిస్తున్న వీర జవానుల పుణ్యమే!
ఎండకు ఎండి వానకు తడిసి
గడ్డకట్టే చలిని లెక్కచేయక
అహర్నిశలు దేశరక్షణకు కంకణం కట్టుకున్న
కఠోర కర్తవ్యనిష్ఠా గరిష్టులు
సునామీలయినా భూకంపాలయినా
ఆటంకవాదుల అరాచకాలయినా
దేశ హద్దుల్లోనూ సరిహద్దుల్లోనూ
నిరంతర సేవా కార్యక్రమాలలో నిమగ్నులు
కడుపులో ఆకలి సుళ్ళు తిరుగుతున్నా
ప్రకృతి భీభాత్సాలకు కకావికలమైన జీవచ్ఛవాలకు
ఆహార పొట్లాలు సరఫరా చేసి
ప్రాణాలు నిలిపే మానవతావాదులు
వారికళ్లు దురాక్రమణలు కనిపెట్టే ఎక్స్‌రేలు
వారిచేతులు శత్రువుల గుండెల్లో డైనమైట్లు
తమ గుండె ఆగిపోతున్నా
ప్రతి గుండెలో వెలుగులు నింపాలనే తపన
ఆఖరి శ్వాస వరకు "సారే జహాఁసే అచ్ఛా
హిందూస్తాన్ హమారా" అని నినదిస్తూ
దేశం కోసం ప్రాణాలర్పించే వీరులు
అందుకే ప్రతి గుండె నినదించాలి
జై జవాన్! జై జవాన్!

# పురుష పుంగవుడు

కాలుమీద కాలు వేసి
వార్తాపత్రిక చేతబట్టి
కాఫీ తెమ్మంచు
ఆలికి ఆర్డరు వేయు
ఆఫీసు పేరు చెప్పి
కమ్మని వంట
కడుపార భుజించు
బొజ్జ పెంచి
భారముగ నడచు
డాక్టరుకు భారీగా ఫీజు
సమర్పించి
మార్నింగు వాకింగ్
మొదలుపెట్టు
అంతేకాని
అర్ధాంగికి
సాయముచేయ
మనసొప్పదు
పురుష పుంగవుడికి.

# అభినేత్రి

బ్రహ్మ చేసిన
అభినేత్రి అమ్మ
పురిటినొప్పులు మరచి
బిడ్డను అక్కున చేర్చుకునే ఆమెలో
సంభ్రమాశ్చర్యాల
కలబోత

"ఛీఛీ" కన్నా అంటూ
బిడ్డను ముద్దు చేసే ఆమెలో
ఆనంద పారవశ్యం
దోబూచులాట

బిడ్డ ఏడుపు వినగానే
స్తన్యమిచ్చి బుజ్జగించే ఆమెలో
కరుణ పొంగి పొర్లుతుంది
తన ఒడినే ఊయలచేసి
జోకొడుతున్న అమ్మలో
ప్రేమ రసం తొణికిసలాడుతుంది
అభినయంలో
అమ్మతరవాతే బ్రహ్మయినా
అమ్మహావభావాల ప్రకటనకు
ఆస్కార్ అవార్డు కూడా తక్కువే!

*(చినుకు ఆగస్టు 2011 మాసపత్రికలో ప్రచురితం)*

# ఒంటరి

అమ్మా! నీకు లభించిన ఏకాంతం
మునులకు సైతం దుర్లభం
ఏకాంతాన్ని వెతుకుతూ అరణ్యాలకు
తరలి వెళతారు మునులు
కానీ, అది నీకు ఇక్కడే
అందరి మధ్యా ఉండి కూడా లభించింది
ఈ చరాచర సృష్టిని నడిపిస్తున్న శ్రీమాత
"ఏకాకిని"
ఆ మాతను అను నిత్యమూ
స్మరించే నీకు బేల తనమేలా?
ఆధ్యాత్మిక చింతన, ఆత్మసోధనలో
నిరంతరం గడిపే నీకు
గతించిన విషయాల గురించి చింతన ఎందుకు?
"ఏకాకిగానే వచ్చాం - ఏకాకిగానే పోతాం"
నడుమ వచ్చే మమకారాల మోహంలో పడకుండా
తామరాకు మీద నీటిబొట్టు వలే కాలం గడుపు
ధ్యానంలో ఇంకా పరిపక్వ దశకు తీసుకెళ్లి
మోక్షానికి మార్గం సుగమం చేయడానికో
ఇంకా మంచి జన్మనివ్వడానికో
ఆ పరాత్పరి యోచిస్తున్నట్టుంది
ఈ ఏకాకినీ జీవితం సద్వినియోగం చేసుకుని
మోక్షానికి మార్గం సుగమం చేసుకో
నువ్వు పూర్ణాయుర్దాయంతో
నిత్యసంతోషిగా జీవించాలని అభిలషిస్తూ...

*(సబల అయిన అమ్మ బేలగామారినపుడు ధైర్యం చెబుతూ రాసిన కవిత 17.09.2010)*

# కాలగమనం

ఎన్ని ఉగాదుల
ఆగమనాలో
ఎన్ని ఆమనుల
నిష్క్రమణలో
అయినా ప్రతీ ఉగాదీ
పచ్చదనంతో పరిఢవిల్లుతూ
యవ్వన హొయలతో
మిసమిసలాడుతూనేవుంది
నేను మాత్రం
ఒక్కొక్క వసంతం
గడుస్తుంటే
కాలగమనంలో
కరిగిపోతూ
వడలిపోతున్నాను.

# ఎక్కడికెళ్లావురా కన్నా!

నలుగురి తరువాత పుట్టావు
నట్టిల్లంతా బంగారమని
అల్లారు ముద్దుగా పెంచాము
నువ్వు ఏడిస్తే కందిపోతావని
నిన్నెత్తుకోవడానికి నన్ను బడిమానిపించారు
మొదటి రోజు నువు బడికెళ్లినపుడు
నీతోపాటు నేను కూడా వెక్కి వెక్కి ఏడ్చాను
అమ్మ నాకు బజారు పనులు చెప్పగానే
నా కంటె ముందు సంచీ తీసుకుని
చెప్పులేసుకుని రెడీగా వుండేవాడివి
నలుగురక్కల నడుమ ముద్దు మురిపాలతో పెరిగావు
ఏ ట్యూషనూ అవసరం లేకుండా
ఇంజనీరింగులో సీటు తెచ్చుకున్నావు
ప్యాంటు వేసుకుని నువు కాలేజీ కెడుతుంటే
నా తమ్ముడు పెద్దవాడయాడని ఎంత సంబరమో!
అంచలంచలుగా ఎదిగావు
అందరి మన్ననలూ పొందావు
అందరికంటె చిన్నవాడివయినా పెద్దరికంతో వ్యవహరించి
నాన్నగారికి కుడిభుజంగా ఎదిగావు
ఉద్యోగంలో నీకు నీవే సాటి
పాకశాస్త్రంలో సాటిలేని మేటి
భోగ భాగ్యాలతో తులతూగినా
ఆధునికత, సాంప్రదాయాలను కలబోసి జీవించావు
శిశు ప్రాయంలోనే లలితాదేవి సాక్షాత్కారం పొందినవాడివి
శ్రీమాత నామాలను ఔపోసన పట్టినవాడివి

అక్కలంటే అతి ప్రేమ
పెద్ద ఇల్లు కడతాను
అందరం కలిసి వుందామనేవాడివి
మీకోసమే పెద్ద కారుకొన్నాను
అక్కలందరితో కలిసి లాంగ్‌ట్రిప్ వేసి
ఘంటసాల పాటలువింటూ
హాయిగా ప్రయాణం చేయాలని ఉత్సాహపడేవాడివి
ఏదైనా సమస్యరాగానే కొండంత అండగా
నువ్వున్నావనుకున్నాము
పుట్టిల్లంటే నువ్వే మాకు
నీ మేనల్లుళ్లకీ మేనకోడళ్ళకీ
నువ్వొక రోల్ మోడల్
నీ లాగా చదువుకోవాలనీ
నీలాగా వుద్యోగం చేయాలనీ
నీలాగా తల్లిదండ్రులను సుఖపెట్టాలనీ
వాళ్ల మనసుల్లో ముద్రవేసుకున్నారు
బహుముఖ ప్రజ్ఞ కనబరిచావు
బహుధా ప్రశంశలు పొందావు
అన్నిటా నీవైనావు
అర్థాంతరంగా జీవితం ముగించి
అందరినీ వదిలి వెళ్ళావు
ఎక్కడున్నావురా నాన్నా
ఎక్కడికెళ్ళావురా కన్నా.

*(జీవితం అర్థ భాగాన్ని మాత్రమే చవిచూసి పైలోకానికేగిన ప్రియమైన తమ్ముడు తల్పసాయి స్మృతి చిహ్నంగా)*

# ఉరి తీసి ఊపిరి

హాయిగా వీచే చల్లగాలికి
తలను అటూ ఇటూ వూపుకుంటూ
తన్మయత్వం పొందుతోంది వృక్షరాజం
సంధ్యాకాంతులు ముసురుతున్నవేళ
పక్షుల రాకకోసం ఎదురుచూస్తూ
గతాన్ని నెమరు వేసుకుంది
తన వృక్ష ఛాయలో
ఎన్ని అనుభూతుల పందిరులో!
చిన్నారుల దాగుడుమూతలాటలు
ప్రేమ జంటల ముచ్చట్లు
ముదిమి వయసు నిట్టూర్పులు
రాజకీయపు టెత్తుగడలు
అన్నిటికీ సాక్షీ భూతంగా
వూరికి పెద్దదిక్కునన్న ఆనందం
ఇంతలోనే పిడుగులాంటి వార్త
నన్ను ఉరితీసి
బహుళంతస్తుల భవనానికి
ఊపిరి పోస్తున్నారని
వేటగాడి బాణం తగిలిన పక్షిలా
గిలగిల లాడింది నా ప్రాణం
ఎండకు ఎండీ వానకు తడిసీ
తనువంతా నిలువు దోపిడీ చేసి
ఈ వూరికీ బాటసారులకీ
కూడూ గుడ్డా కల్పించి

పరోపకారమే పరమావధిగా బ్రతికాను
నిర్జీవినై కూడా, కలపగా
వంటచెరుకుగా, ఇంటి దూలంగా
ఉపయోగపడతానే!
ఏ మాత్రం కనికరం లేకుండా
ఇలానరికివేయడం న్యాయమేనా?
బహుశః తిన్నింటి వాసాలు లెక్క పెట్టడం
ఒక్క మానవుడికే సాధ్యమేమో!
అయినా! నా గురించి కాదు నా బాధంతా
ఇలాగే మా వృక్షజాతి అంతరించిపోతే
రేపటి తరం
ఆకు పచ్చని దాహంతో
అలమటిస్తారనే!

*(డా॥ పట్టాభి కళాపీఠం వారి పర్యావరణ
కవిసమ్మేళనంలో చదివిన కవిత)*

# పుస్తకమంటే భయం

పుస్తకమంటే నాకు భయం
హాయిగా ఆడుతూ పాడుతున్న నన్ను
పుస్తకాల సంచి ఇచ్చి
బడికి పంపించారు
క్లాసు వర్కులనీ, హోమ్ వర్కులనీ
ఒక్కక్షణం కూడా
వూపిరాడకుండా చేశారు
నా ఆటపాటలను దోచేసిన
పుస్తకాలను చూస్తుంటే నాకు భలే భయం
హమ్మయ్య!
స్కూలు చదువయిపోయిందనుకుంటే
మళ్లీ కాలేజీలోనూ పుస్తకాలే!
ఉద్యోగంలో పుస్తకాలుండవనుకున్నా!
పనికి సంబంధించిన రూల్స్ రెగ్యులేషన్సు చదవాలన్నారు
పెళ్లికాగానే పిల్లల బాధ్యతలు
వాళ్ళకి అర్థంకాని పాఠాలు చెప్పడం
హోమ్‌వర్కులు చేయించడం
మళ్లీ పుస్తకాలే!
బాధ్యతలు తీరి
హాయిగా వుందామనుకుంటే
వూరికే తినికూచోక
రామాయణ భాగవతాలు చదువుకో
పుణ్యంపురషార్థం అంటూ
పుస్తకాలు నాముందేశారు శ్రీవారు.

## అనుకోని అతిథి

అనుకోని అతిథి
ఒక్కొక్కసారి
ఎడారిలో
ఒయాసిస్‌లా
కనబడతాడు
మరోసారి
విలువైన సమయాన్ని
హరించే
కాలయముడిలా
అగుపిస్తాడు.

## సమన్వయం

పెదాలు రెండూ
కలిసి విడిపోతే
అమ్మ
నాలుక పైకి కిందికి
కొట్టుకుంటే నాన్న
ఈ రెండింటికీ
మధ్య వారధిలా
తెల్లటి "పళ్ళు" లాంటి 'పిల్లలు'
అన్నం నమలడానికీ
పనికి వస్తాయి
పెదిమను, నాలుకను
కొరకటానికి కూడ పనిచేస్తాయి.

# కోతి మనసు

"మంచి విను
మంచి మాట్లాడు"
అవే భగవంతుడిని
చేరే మార్గం చూపుతాయి అంటూ
స్వామీజీ ఉపన్యాసం
ఆ మాటలు మనసులో
పదిలంచేసుకుని ఇంటికి చేరా!
పక్కింటావిడ
పిట్టగోడ మీద నుంచి
సైగ చేసింది
"విన్నారా" మహలక్ష్మి కొడుకు
కులంకాని దాన్ని చేసుకుని
విడి కాపురం పెట్టాడట
కొడుకు గురించి
ఎన్ని గొప్పలు చెప్పేది?
గర్వమంతా అణిగి పోయింది"
వాడిగా వేడిగా
మసాలా కబురందించింది
ఆహా! అంటూ ఆసక్తిగా
చెవులురిక్కించి మరీ విన్నా
క్షణం క్రితం విన్న స్వామిజీ బోధన
ఎక్కడికో ఎగిరిపోయింది
మనసు కోతిలాంటిదని
స్వానుభవంలోకి వచ్చింది.

## సన్నాయి నొక్కులు

గల్లీ గల్లీకో
మద్యదుకాణానికి
'లైసెన్సు' ఇచ్చి
మరణ మృదంగం మ్రోగిస్తూ
మద్యపానం
ఆరోగ్యానికి హానికరం
అంటూ సర్కారు
సన్నాయి నొక్కులు
'అశ్వద్ధామ హతః
కుంజరః' అన్నట్టు.

## ఎగిసిపడే అల

ఏమి లేనమ్మ
ఎగిరెగిరి పడుతుందన్న
సామెతగా
ఉప్పు నీటి సముద్రం
అలలు అలలుగా
ఎగిసిపడుతుంది
త్రాగునీరందించే
తీయని నదీమతల్లి
అణిగిమణిగే వుంటుంది.

# మీడియా

అతడో నరరూప రాక్షసుడు
ముంబయి నగరంలో మారణకాండకు ఆద్యుడు
నెత్తుటి మడుగులో కొట్టు మిట్టాడుతున్న
అమాయక ప్రాణులను ప్రాణాలొడ్డి రక్షించిన
ముగ్గురు మానవీయ అధికారులను
నిర్దయగా పొట్టన పెట్టుకున్న కిరాతకుడు
శభాష్! పోలీసోడా
ఎట్టకేలకు పట్టుకున్నావు కసాయి "కసబ్"ను
వాడిని వందసార్లు ఉరితాయాలని
ప్రతి భారతీయుడి హృదయం పరితపించింది
శిక్షను ఖరారు చేయడానికి అతని కేసు
న్యాయస్థానానికి అప్పగించారు
ఎంత గొప్పదో మన న్యాయ వ్యవస్థ
అతని తరఫున వాదించడానికి
న్యాయవాదిని ఏర్పాటు చేసింది
మేము మాత్రం తక్కువా అంటూ
ఆ కిరాతకుడి గురించి వాడిగా వేడిగా
"బిర్యానీ కావాలన్న కసబ్"
"రాఖీ కట్టించుకుంటానన్న కసబ్"
అంటూ వార్తలు ప్రముఖంగా ప్రచురించి
ఒక హీరో కిచ్చినంత ప్రచారం ఇచ్చింది మీడియా
సుదీర్ఘ వాదోపవాదాలనంతరం అతడికి
ఉరిశిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష, ఇంకా
అనేక ఇతర శిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు నిచ్చింది

ఈవార్తకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ
పోటీలుపడి మరీ ప్రసారం చేశాయి
ప్రసార మాధ్యమాలు
దీనివల్ల ఏపని చేసయినా
మీడియా హెడ్‌లైన్స్‌లో కనపడచ్చుఅని
యువత పెడదారులు పట్టే ప్రమాదముంది
యువత మీద కాదు
మీడియా మీద ఆధారపడివుంది దేశభవిత
అని తిరగరాయాలి
సంఘ విద్రోహశక్తుల కథనాలు
పదేపదే ప్రసారం చేస్తూ
సామాన్యుడిని తప్పుదోవ పట్టించవద్దని
పౌరులందరూ కోరుకుంటున్నారు
మీడియా! నీ తీరు మార్చుకోవా?

*(కసబ్ సృష్టించిన మారణకాండకు స్పందనగా)*

*'మీడియా' అనే అంశం మీద సాహితీస్రవంతి వారు ఏర్పాటుచేసిన కవి సమ్మేళనంలో చదివిన కవిత.*

# గడసరి తొలకరి

తొలకరీ నీవెంతో గడసరి
ఇదిగో వస్తున్నానని మురిపించావు
భూమాత పులకించి వెదజల్లిన
మట్టి పరిమళం ఆశ్వాదించే లోపు
కనుమరుగయావు
తొలకరీ నీవెంతో సొగసరి
చిరుజల్లుకు మురిసిన రైతన్న
వరినాట్లు వేయగానే
మబ్బుల్లో దాగి దాగుడుమూతలాడుతున్నావు
తొలకరీ నీ పలకరింపు
ఎండిన కుత్తుకలకు అమృతధార అవుతుందనీ
సంబంర పడినంతలోనే ఆశనిరాశల మధ్య
మా బతుకులు తూకం వేస్తున్నావు
వరుణయాగాలు చేసి ఆహ్వానిస్తేగానీ రావా?
నీ ఆహ్వానపు ఖర్చుకు ఖజానా ఖాళీ అయి
దాహానికి కూడా పన్ను వేస్తారు పాలకులు
వద్దు తొలకరీ! సామాన్యుడిని ఇక్కట్లపాలు చేయకు
ఇక దాగుడు మూతలు చాలించి ధారాపాతంగా కురిసి
మూగపోయిన సెలయేళ్లను గలగల పారించు
పంట పొలాలను సస్యశ్యామలం చేయి
మా జీవితాలను హరితవనంలా తీర్చిదిద్దు.

*(విశ్వసాహితీ వారు 'తొలకరి' మీద నిర్వహించిన కవి సమ్మేళనంలో చదివిన కవిత)*

## అక్షరం

అక్షరం
నడత నేర్పింది
అక్షరం
మమత నేర్పింది
అక్షరం
భుక్తి నిచ్చింది
అక్షరం
ముక్తిని చూపింది
ఆ మార్గంలో
పయనించి
అక్షరం
రుణం
తీర్చుకో.

## కత్తి మీద సాము

వర్షాలు పడక
పంటలు పండక
రైతుల రోదన
వరుణయాగ ఫలంగా
వానలు కురిస్తే
వరదలు ముంచెత్తి
పంటలు మునిగి
అప్పులు తీర్చలేక
పురుగు మందుతాగి
ఆత్మహత్యలు
రైతన్న బతుకు
ఎప్పుడూ
కత్తిమీదసామే!

# ఎంతమందో!

మీకెంతమంది
దేవుళ్లో అంటూ
మిడి మిడి జ్ఞానంతో
వెటకారం!
ఒకే స్త్రీ
అమ్మ, అత్త, పిన్ని
కోడలు, అక్క, చెల్లి
అంటూ బహువిధాలుగా
పిలువబడినట్టుగా
ఒకే దేవుడు
తనలోని ఒక్కొక్క శక్తికి
ఒక్కొక్క రూపాన్నిచ్చి
వివిధ నామాలతో
కార్యసిద్ధి
కలిగిస్తున్నాడు
బహురూపిగా పిలవబడే
ఏక పాత్రధారి
ఏకోనారాయణుడు.

# అతనికంటె ఘనుడు

అర్ధరాత్రి దొంగలుపడి
నగలన్నీ దోచుకుపోయారు
పోలీస్ కంప్లైంట్ ఇచ్చాం
కాసులతడి తగిలితేకానీ పోలీసు
కేసుముట్టుకోడంటూ ఉచిత సలహాలు
ఈ గొడవలకి కంటికి కునుకు పట్టడంలేదు
నాలుగోరోజు మళ్లీ దొంగలు వచ్చారు
కళ్లు పత్తికాయల్లా తెరుచుకు పడుకున్నానేమో!
వాళ్లను చూసి భయంతో గట్టిగా అరిచా!
చుట్టు పక్కల వాళ్లంతా గుమిగూడారు
ఆ చోరశిఖామణి ఏమాత్రం నదురూ బెదురూ లేకుండా
"రోజుకో నగవేసుకుని షోగ్గా తిరుగుతుంటే
పెద్ద పథకంవేసి కష్టపడి మరీ దొంగతనం చేశాం!
వన్‌పర్సంట్ గోల్డుతో మమ్మల్ని మోసం చేస్తావా! అంటూ
నగలు నా మొహాన కొట్టి
ఆ చెంపా ఈ చెంపా వాయించి మరీ వెళ్లాడు
అవమానంతో బిక్కచచ్చి పోయాను
ఇంతకంటె పెద్దదొంగ నా జామాత
బిజినెస్ పెట్టాలంటూ నగలన్నీ
ఘరానాగా కాజేశాడని వాళ్లకెలా చెప్పను?
వన్‌పర్సంట్ గోల్డుతో కాపాడు కుందామనుకున్న
నా పరువు సెంట్‌పర్సంట్ పోయింది.

# స్వాంతన

ప్రేమ సముద్రంలో
నిండామునిగాక తెలిసింది
సుడిగుండంలో చిక్కుకున్నానని
ప్రేమ విఫలంకంటె భరించలేని బాధ
మరొకటి లేదనిపించింది
దెబ్బతగలకముందే
ఆ రాయిని ఆపలేకపోయాను
అమ్మకు ముందే చెబితే
పరిష్కారం చూపేదేమో!
అతని మాయలోపడి
మిత్రులను కూడా దూరం చేసుకున్నాను
మోసపోయానన్న నా బాధను
పంచుకునేవారు ఎవరూ మిగలలేదు
గుండెనిండా మిగిలిన ఆవేదన,
రా రమ్మని పిలిచే మృత్యువు తప్ప
నన్ను క్షమించమ్మా! అని
ఆఖరుసారిగా అమ్మను తలచుకొన్నా
మోసం చేసి అతడు దర్జాగా తిరుగుతుంటే
నీకు మాత్రం బతికే హక్కు ఎందుకు లేదు?
కంటికి రెప్పలా నిన్ను
కాపాడుకుంటూ
పాతికేళ్ళుగా
నీ మీదే ప్రాణాలు
పెట్టుకుని బతుకుతున్న
ఈ అమ్మ ప్రేమకు

నీ జీవితంలో చోటులేదా?
ఒక్కసారి ఆలోచించు అని
అమ్మ అభ్యర్థిస్తున్నట్టనిపించింది
వెన్ను చరిచినట్టయింది
ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని
నా కోసం జీవించిన అమ్మను
ఎలా మరచిపోయాను?
అమ్మప్రేమ హస్తాలలోవాలి
స్వాంతనపొందాలని
వడివడిగా
వెనుతిరిగా!

# కాపురానికి వలస

భారీ కట్నకానుకలతో
మూడుముళ్ళ తాడుతో
మూడక్షరాల తంతు ముగిసింది
గుండెనిండా ప్రేమ తడి
నింపుకున్న అమ్మను వదిలి
తడిలేని పలకరింపుల
కాపురానికి వలస
ఆపేక్షగా దగ్గర చేరినా
చూపుల తూటాలు
పరాయిగా నిలబెట్టాయి
కాసులకేతప్ప
కాంత ప్రేమకు విలువివ్వని
హీన సంస్కారం
గాయమైన గుండెలో గుబులు
మనసులో ముసురుకున్న దిగులు
కనుకొలికిదాటి
బయటికిరాని
కన్నీటికే తెలుసు.

# ట్యాంక్‌బండ్ మీద అపురూప దృశ్యాలు

సాయంకాలం
చల్లగాలి పీలుద్దామని
ట్యాంక్‌బండ్‌కి షికారుకెళ్లా
మనస్సు పెట్టి చూడాలేకానీ
ఎన్ని అపురూప దృశ్యాలో!
అప్పుడప్పుడే వెలుగు రేఖలు
పక్కకి తొలగి
చీకటికి చోటిస్తున్నాయి
బోటు షికార్లతో
పిల్లల కేరింతలతో
హోరెత్తిన హుసేన్‌సాగర్
నిశ్శబ్దతరంగిణిలా మారింది
బుద్ధుడి జ్ఞానోదయంముందు
అజ్ఞాన తిమిరాంధకారంలా!
అమ్మాయిల దృష్టి ఆకర్షించటానికి
కుర్రకారు పడుతున్న అవస్థలు
ఎవరి కంటయినా పడతామేమోనని
భయం భయంగా అటుఇటు చూస్తూ
కబుర్లు చెప్పుకుంటున్న ప్రేమజంటలు
అక్కడక్కడే తచ్చాడుతున్న పల్లీల కుర్రవాడు
కులుకులుపోతూ గుసగుస కబుర్లతో
కొత్తగా పెళ్లయిన పడుచుజంటలు
మల్లెపూలవాడికి పసందైన గిరాకీ

సిమెంటు బెంచీలమీద
పసిడి పలుకుల పసివాడిని
ఆడిస్తూ మురుస్తున్న అమ్మానాన్నలు
బాధ్యతలు తీరి టైమ్‌పాస్ కోసం వచ్చిన
నడివయసు జంటలు
మనుమల ఆటపాటలతో మమేకమై
మురుస్తున్న ముదిమిజంటలు
ఫ్లడ్‌లైట్ల కాంతిలో ప్రశాంత వదనంతో
ఆహ్లాదం పంచుతున్న బుద్ధ భగవానుడు
చీమలబారులల్లే వచ్చేపోయే
వాహనాల మిరుమిట్ల కాంతిలో
నెక్లెస్ పెట్టుకున్నట్లున్న
టాంక్‌బండ్
నగరానికే ఓ హైలైట్.

## వెన్నెల కల్లాపి

వెన్నెల కల్లాపి
చల్లిన వాకిట్లో
రంగవల్లులవుదామని
పరుగున దిగివచ్చాయి
తారకలు
సంభ్రమంతో
వాటిని దోసిలిలో
బంధిద్దామనుకున్నా
చేతికి చిక్కలేదు ఒక్కటీ
మదిలోనే చిత్రంగా
మలచుకున్నా
ఆ మనోహర దృశ్యాన్ని.

## గడ్డి మొక్క

నువ్వు వెళ్లేదారిలో
ఎన్నో పిచ్చి మొక్కలు
తొక్కకుండా
పక్కకు జరిగి
పలకరించిచూడు
మదినిండా
వసంతాలు
కుమ్మరిస్తాయి
కృతజ్ఞతతో
తలలువంచి
పాదాభివందనం చేస్తాయి.

# ఖర ఘోష

నా పేరుతో వచ్చిన ఓ ఖరనామ ఉగాదీ!
నా ఘోష ఆలకించు ఓసారి!
గార్దభ స్వరం, గాడిద తన్నులు
గాడిద బరువు, గాడిద ఓండ్ర
అంటూ వ్యంగోక్తులతో
నన్ను కించపరుస్తుంటారు.
ఇంతే కాదు
అడ్డగాడిద, బుద్ధిలేని గాడిద
పనికి రాని గాడిద, సిగ్గులేని గాడిద అని
దుష్టులకు నా పేరు ముందు తగిలించి తిడుతూ
నన్నవమానిస్తుంటారు
మౌనంగా నాలో నేను బాధపడుతుంటాను
నిజానికి సమాజానికి నేను చాలా ఉపయోగకారిని
బయట పారవేసిన చిత్తు కాగితాలు తిని
పర్యావరణ శుభ్రతకు పాటు పడతాను
పరులసేవే పరమావధిగా భావించి
మైల బట్టలను వీపున మోసుకు పోతాను
ఎంత బరువు మోపినా ఓర్పు వహిస్తాను
దుర్మార్గులకు బుద్ధి చెప్పడానికి
నా మీద ఎక్కించుకొని, వూరంతా వూరేగించి
సిగ్గిల చేసి, అతడిలో పరివర్తనకు దోహదపడతాను
తలదించుకుని ఎదురాడక
చెప్పిన పని వినయముగా చేయు బుద్ధిశాలిని నేను
నా చాకిరీకి కితాబుగా
'గాడిద చాకిరి' అనే నానుడి కూడా వచ్చింది.

ఇంతేనా?
నా క్షీరము పలు వ్యాధులు నయం చేసే దివ్యౌషధము
ఇన్ని సుగుణాలున్న నన్ను
కించపరచడం ఈ మానవులకు తగునా
ఈ ఖరనామ సంవత్సరములో అయినా
'ఖల్' నాయకులను నిందించుటకు
నాపేరు వాడవద్దని మనవి చేస్తున్నాను
నాకున్న ఓర్పు, వినయం, పరుల సేవ
అందరూ కూడా అలవరచుకొని
నా పేరు నిలపాలనీ
రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని
కోరుకుంటున్నాను.

చివరిగా
మానవసేవే మాధవసేవగా ఎంచి
ఎదురాడక
చెప్పిన పని వినయముగా చేయు
మానవతా వాదిని
నా సేవలకు గుర్తింపుగా
రాష్ట్ర ప్రభుత్వ
"ఉత్తమ సేవా పతకం"
అదే ఖరనామ ఉగాది పురస్కారానికి
నా పేరు సిఫారసు చేయమని
అభ్యర్థిస్తున్నాను
అందులకు ప్రతిఫలముగా
సదా మీ సేవలో
మీ ఖరము.

*(ఏప్రిల్ 2011 సాహితీ కిరణం మాసపత్రికలో ప్రచురితం)*

# అవ్యక్తం

ఒకోరోజు
నిదురలేస్తూనే
ఎంతో ఉల్లాసం
ఆ రోజంతా
ఏదో తెలియని ఆనందం
మనసు ఆకాశాన విహరిస్తున్నట్టు
ప్రపంచమంతా గుప్పిట్లోవున్నట్టు
ఏదైనా సాధించగలననే ఉత్సాహం
మరునాడేమౌతుందో!
విహంగంలా ఎగిరిన ఉత్సాహం
దారం తెగిన గాలిపటంలా
గమ్యంలేని ఆలోచనలతో
ముళ్లకంచెకు చిక్కి
గిలగిలలాడుతున్నట్టుటుంది
అవ్యక్తం
ఈ మనసు మాయ.

# గులాబీ సౌరభం

నా తనయ పుష్పవతియై
యౌవన సౌరభాలు విరజిమ్ముతోంది
తనపలుకులో విరితేనియలు
విరుపులో శరద్రాత్రి వెన్నెలలు
కులుకులో మలయమారుతాలు
నవ్వులో కృష్ణవేణి గలగలలు
అందానికే అందమన్నట్టున్న నా ప్రతిబింబ
సౌందర్యానికి నన్నునేను మరచి
వాత్సల్య పూరిత నయనాలతో దిష్టితీశా
"ఎంత మురిపెమయినా
ఓ అయ్యచేతిలో పెట్టాల్సిందేగా"! అన్నమాటలకు
ఒక్కసారి ఒళ్లు ఝల్లుమంది
ఈ సౌందర్యరాశిని కలకాలం అపురూపంగా
చూసుకునే వరుడు దొరుకుతాడా అని
మనసులో అలజడి
సారంలేని సంసారంలో అనుభూతుల్లేని బొమ్మగా
మారకూడదు నా బంగారు తల్లి
ఏమో! ఏంచెప్పగలను? మేకవన్నెపులు లుంటారు
అందుకే! గులాబీలాంటి నా సుకుమారికి
వ్యక్తిత్వ వికాసమనే ముళ్లకంచె ఏర్పాటు చేశా!

## అశాంతి

మహర్షుల
జీవిత చరిత్ర
చదివి
ప్రశాంతంగా జీవనం
గడుపుదామని
మనసు వేదిక మీద
రాసుకున్నా
దాని చిరునామా
చిక్కడం లేదని
వెదుకుతున్నా.

## బురఖా

బురఖాలో బందీ
అయిన
అపురూప సౌందర్యం
తిలకించాలని
వాయుదేవుడు
కూడా
మనసు పడ్డాడేమో!
విద్యుల్లత
క్షణకాలం మెరిసి
మాయమయింది.

# చకోర పక్షులు

ఆటపాటల హరివిల్లు వేసవిలో మా ఇల్లు
మనుమడు మనవరాలి రాక
మా ఉదాసీన జీవితాల్లో చైతన్య వసంతగీతిక
ఈ మూడు నెలలూ వాళ్లతో
సరదాగా గడపడానికి
యవ్వనాన్ని పోగుచేసుకుంటాము
అటకెక్కిన క్యారమ్, ఛెస్ బోర్డులు
దుమ్ముదులుపుకుని రెడీగా వుంటాయి
మనవరాలికి అరిసెలు ఇష్టమనీ
మనవడికి జంతికలు పసందనీ
వాళ్ళ ముచ్చట్లు చెప్పుకుంటూ
ఆయన పిండి వత్తితే
నేను బాణలిలో వేయిస్తూ డబ్బాల్లో నింపిపెడతాము
మామిడిపండ్ల తాతనీ, ఐస్ క్రీమ్ బండివాడినీ
ఆ మూడు నెలలూ గుత్తకు మాట్లాడుకుంటాము
వయసు వూసు లేకుండా
వాళ్ళతో సమానంగా అల్లరిచేస్తూ
ఆడుతూపాడుతూ ఆనందంగా గడిపేస్తాం
ఈసారికూడా వేసవికోసం
చకోరపక్షుల్లా ఎదురు చూస్తున్నాము
సుపుత్రుడి దగ్గరనుంచి లేఖ వచ్చింది
చదవండి ఎపుడొస్తున్నారో అంటూ
ఆతృతగా ఆయన్ని తొందరచేశా!
చదువుతున్న వారి మోహం మ్లానమయింది.
ఈవేసవిలో పిల్లలకు పైక్లాసు

సిలబస్‌లో కోచింగ్ ఇస్తున్నారు
మిస్ చేస్తే ర్యాంకులు రావడం కష్టం
స్విమ్మింగ్, పెయింటింగ్
క్లాసుల్లో కూడా చేరారు
సెలవుల్లో మీ గారాబంతో పిచ్చి అల్లరి చేస్తూ
డిసిప్లిన్ లేకుండా బడుద్ధాయిల్లా తయారయారు
అందుకే ఈ వేసవికి రావడానికి కుదరదు
అని లేఖ సారాంశం
మా జనసత్వాలు ఒక్కసారిగా
నీరుకారి పోయాయి
క్రమశిక్షణ పేరుతో
బందీలయిపోయిన మొగ్గలు వాళ్ళు
కాటికి కాళ్ళు చాపుకున్న
ముగ్గిన పండ్లమి మేము

మా గురించి వారి భవితపాడవకూడదనీ
వాస్తవాన్ని గ్రహించమని మనసు చెబుతున్నా
బాధ కన్నీటి రూపంలో తన్నుకువచ్చింది
ఆసరా కోసం ఒకరినొకరు పట్టుకుని
సోఫాలో కూలబడ్డాము
వేసవి వేడిగా వుంటుందని
అపుడే మాకు అవగతమయింది.

*(డిసెంబరు 2010 "ఆంధ్రప్రదేశ్" మాస పత్రికలో ప్రచురితం)*

# ఒక్కసారి ఆలోచించండి

ఊరిదంతా ఒకదారి అయితే
ఉలిపికట్టది మరోదారి ఎలా అవుతుంది?
తల్లిదండ్రులు క్లబ్బుల్లో పేకాడుతుంటే
పిల్లలు పబ్బుల్లో జల్సాచేస్తున్నారు
ఇది నేటి నాగరిక సమాజ దుస్థితికి దర్పణం
వయసుకి 'డై' చేసుకుని
కుర్రకారుతో పోటీపడుతున్న వస్త్రధారణతో
సినిమాలు, షికార్లతో గడిపే అమ్మనాన్నలు
బిగుతు దుస్తులతో పరువాలను ప్రదర్శిస్తూ
కుర్రకారు మతి చెడగొట్టే తనయకు
ఏమని సలహాలివ్వగలరు?
విరిసీవిరియని మొగ్గలను
బూతుపాటలకు స్టెప్పులేయిస్తూ
కళారాధన పేరుతో
బుల్లితెరలో ప్రదర్శనలిప్పిస్తున్నారు
అందాలపోటీలకు ఆత్మజను
తయారు చేయడమే ధ్యేయంగా
అంగాంగ కొలతలతో
అంగడి బొమ్మలా తయారు చేస్తున్నారు
మద్య వ్యాపార ప్రకటనలకు
కూతురి అందచందాలను నడిబజార్లో
హోర్డింగులుగా నిలబెట్టి సొమ్ము చేసుకుంటున్నారు
నాగరికత ముసుగులో
భావి పౌరులను తీర్చిదిద్దే బాధ్యత మరుస్తున్నారు
"స్త్రీ" ని
'తల్లీ', 'చెల్లీ' అనే
పవిత్ర భావంతో చూసే జాతిని
కామోద్రేక మృగాలుగా మారుస్తున్నామేమో
ఒక్కసారి ఆలోచించండి.

*(మే 1, 2011 "ఆంధ్రప్రభ" ఆదివారం సంచికలో ప్రచురితం)*

# ఆల్బమ్

ఆల్బమ్‌లోని
పాత ఫోటోలు
గత స్మృతుల
మధురిమలు
బాల్యంలోకి
పరకాయ ప్రవేశంచేస్తూ
ఆప్యాయత, అనురాగం
కలబోసిన నాటిముచ్చట్లు
మిత్రులకు
దృశ్యమానం చేస్తుంటే
ఒళ్ళు మైమరచిన ఆనందం
పెరుగన్నంలో ఆవకాయ ముక్క
నలుచుకున్నంత పరవశం

*(నవ్య ఆగస్టు 17 వారపత్రికలో ప్రచురితం)*

# చెప్పలేని హాయి

ఉషోదయాన
సన్నని తుంపరలో తడుస్తూ
పక్షుల కిలకిలలు వింటూ
పచ్చని చేల వెంబడి నడుస్తుంటే నులివెచ్చిన హాయి

తొలకరి జల్లుకు
భూమాత పులకించి
వెదజల్లిన మట్టివాసన
నాసికాపుటాలను తాకుతుంటే కమ్మనిహాయి

కురిసిన వానజల్లు
చిరుకాలువలై పారుతుంటే
కాగితం పడవలు వేసి
మురిసిన పసితనం ఎంతో హాయి

సాయంసంధ్యలో
పిట్టగోడ మీద కూచుని
చిరుజల్లులు ఆశ్వాదిస్తూ
వేడివేడి పకోడీలు తింటుంటే పసందైన హాయి

అర్థరాత్రి చిరుగాలి మోసుకొచ్చిన
చల్లని జల్లుకు ఒళ్లు ఝల్లుమని
చెవుల మీదకు దుప్పటిలాగి
ముడుచుకు పడుకుంటే చెప్పలేని ఆ హాయి
ఎంతో వెచ్చగవుంటుందోయి

# మనసుకు తాళం

నాకు బాగా గుర్తు
చిన్నతనంలో
నేనూ నా మనసు ప్రాణంలో ప్రాణంగా
కలిసేవుండే వాళ్ళం
నాకు నచ్చినవే
మనసుకు నచ్చేవి
మనసు మెచ్చినవే
నాకు నచ్చేవి
నేను యవ్వనంలోకి
అడుగిడగానే
నాకూ మనసుకూ పడేది కాదు
తుళ్లి తుళ్లి పడేది వయసు
హాళ్లూ పెళ్లూ వద్దనేది మనసు
కోపంతో మనసుకి తాళం వేశా
హెచ్చరిక చేసేవారులేరని
సంబరంతో
స్వేచ్ఛా విహంగంలా విహరించా
ఎలా తెలిసిందో ఏమో!
మనసులేని మనిషని నిందించింది సమాజం
వయసు మత్తుకి అని వినిపించలేదు కానీ
మనసు మాత్రం అసహనంగా కదులుతూ
తాళం పగలకొట్టుకొని
మళ్లీ నాఎదలో దురాలని
శబ్దం చేస్తోంది.

# మాటే మంత్రము

మాటలో వుంది మాధుర్యం
మాటలో వుంది కాఠిన్యం
మాట మల్లెలా చల్లనైనది
మాట కత్తిలా పదునైనది
"మైడియర్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్ ఆఫ్ అమెరికా"
అన్న స్వామి వివేకానంద సంబోధన
మానవాళిలో సోదరభావాన్ని మేల్కొలిపిన మాట
"జయించేవాడికి ఈ ప్రపంచం
చాలా చిన్నది" అన్న అలెగ్జాండర్ స్ఫూర్తి
విజయ సాధనకు ఉత్తేజకరమైన మాట
"దేశమును ప్రేమించుమన్నా"
అన్న గురజాడ పిలుపు
దేశభక్తికి ప్రబోధించిన మాట
"క్విట్ ఇండియా" అన్న మహాత్ముడి గర్జన
తెల్లదొరలను పారద్రోలిన కత్తిలాంటి మాట
"దేశానికి రాజునైనా ఒక తల్లికి బిడ్డనే" అన్న
పి.వి. నరసింహారావుగారి నిరాడంబర పలుకు
సంస్కారవంతమైన మాట
వైరి పక్షాల మధ్య మాటలు
యుద్ధాలను ఆపగలవు
స్నేహ హస్తాలను అందించగలవు
మాటలోనే వుంది మర్మమంతా
అందుకే మన "వేటూరి" అన్నారు
"మాటే మంత్రము" అని.

# వంకర టింకర

కాళ్లు రెండూ
కలిసినడుస్తే గమనం
కళ్లు రెండూ
కలిపి చూస్తే దృశ్యం
పెదవులు రెండూ
కలిస్తే మాటలు
చేతులు రెండూ
కలిస్తే చప్పట్లు
అవయవాలన్నీ
ఐకమత్యంతో
కలిసి పనిచేసుకుంటున్నాయి
వీటన్నిటినీ నడిపించే మనసు
మాత్రం ఒకటే
అందుకే
దాని తీరు
వంకర టింకర.

*(సాహితీ కిరణం ఆగస్టు 2011 మాసపత్రికలో ప్రచురితం)*

# మధురం

ఆకాశంలో విమానాన్ని చూసి
చప్పట్లు కొట్టి "టాటా"
చెప్పిన అమాయకత్వం.

"కొంగా కొంగా"
నా గోళ్ళమీద పువ్వేసిపోవే
అంటూ చేతులు చాపిన ముగ్ధత్వం.

వాన నీటిలో కాగితపు పడవలు వేసి
మునిగిపోకుండా చూడమని
దేవుడికి మొక్కుకున్న పసితనం

ఇసుకలో కట్టిన గూడులో
పిచ్చుక పడుకుందో లేదోనని
వేకువజామున లేచి చూచిన స్నిగ్ధత్వం

నీటి చలమలోని చేప పిల్లల్ని
దోసిలిలో పట్టి
కితకితలు పెడుతుంటే కలిగిన పరవశం

తుమ్మెద రెక్కకి దారంకట్టి
పతంగిలా ఎగరేసి
మురిసిన చిలిపితనం

తలచుకుంటే
ఎదలో గిలిగింతలు
మదిలో పులకింతలు

బాల్యమా!
నీవెంత మధురం.

# ధర్మకేతనం సాహిత్య కళాపీఠం

## హైదరాబాద్

వారి

## ప్రశంసా పత్రము

శ్రీయుత/శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ (హైదరాబాద్) గారికి 'అవ్యక్త' శతాధిక కవుల స్నేహకరచాలనం కవితా సంపుటికి మీ సుందర సుమధుర స్నేహపరిమళపూరితమైన కవిత పరిమళం ను చెలిమితో అందించి, సాహిత్య చరిత్రలో చిరకాలం నిలిచిపోయే సంకలనంగా తీర్చిదిద్దినందులకు మిమ్ములను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము.

| ఎన్వీ. రఘువీర్ ప్రతాప్ | దార్ల విశ్వనాథ్ | 'అవ్యక్త' సంపాదక వర్గం |
|---|---|---|
| వ్యవస్థాపక అధ్యక్షులు | ప్రధాన కార్యదర్శి | సమన్వయకర్త |

స్థాపితం 1994

అమెరికా తెలుగు సాహిత్య వేదిక

## వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (రిజిస్టర్డ్ ట్రస్ట్)

వంశీ ఇంటర్నేషనల్ క్యాంపస్

సర్వే నెం. 99 పార్ట్, సత్యసాయి పురం, కుంట్లూరు, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ - 501 505. ఆంధ్రప్రదేశ్, ఇండియా,
(హైదరాబాదు నుండి విజయవాడ వెళ్ళేదారిలో 23.6 కి.మీ. రాయి దగ్గర ఎడమ చేతివైపు తిరగవలెను)
మొబైల్ నెం. 98490 23852 Email :ramarajuvamsee@yahoo.co.in

రెండవ అంతర్జాతీయ తెలుగు మహిళా రచయితల
సాహితీ సమ్మేళనంలో పాల్గొని
జయప్రదం చేసినందుకు

కేతవరపు రాజ్యశ్రీ గారికి

మా ధన్యవాదాలు

మీ



డా॥ వంగూరి చిట్టెన్ రాజు
వ్యవస్థాపకులు, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, హ్యూస్టన్ మరియు హైదరాబాదు
Cell : 832-594-9054 - Email : vangurifoundation@yahoo.com
website : www.vangurifoundation.org
Blog : www.vangurifoundation.blogspot.com

ఆగస్టు 29, 30, 31 తేదీలు 2010
వేదిక: శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి, హైదరాబాదు -500 020, ఆంధ్రప్రదేశ్, ఇండియా.



ప్రముఖ టి.వి. నటి యాంకర్ శ్రీమతి జి. ప్రగతి మరియు ప్రముఖ కవి శ్రీ ఉండేల మాలకొండారెడ్డిగారిచే సత్కారం. చిత్రంలో జి.వి.ఆర్. ఆరాధన సంస్థ అధ్యక్షులు శ్రీ జి. వెంకట రెడ్డి, చేతన కార్యవర్గ సభ్యులు శ్రీమతి జి. కృష్ణవేణి, శ్రీమతి నిర్మల, శ్రీ ఎన్. ప్రసాద్, శ్రీ శేషుశేఖర్, శ్రీ చంద్రశేఖర్.

సచివాలయంలో ఉపకార్యదర్శి హోదాలో పదవీ విరమణ చేసిన సందర్భంగా ప్రభుత్వ కార్యదర్శి (సర్వీసులు), ప్రధాన పరిపాలనాశాఖ వారిచే సత్కారం. చిత్రంలో ప్రభుత్వ ఉపకార్యదర్శి మరియు ప్రముఖ కవయిత్రి శ్రీమతి చిల్లర భవానీదేవి వున్నారు.





విశ్రాంత అదనపు కార్యదర్శి శ్రీ డి. నారాయణరావుగారిచే పుష్పగుచ్ఛ బహుకరణ

"నీలోకి నువ్వు" ఆధ్యాత్మిక పుస్తకావిష్కరణ సందర్భంగా మాతృమూర్తి శ్రీమతి మహాకాళి ప్రభావతిగారికి సత్కారం చిత్రంలో శ్రీమతి పెండ్యాల జయశ్రీ వున్నారు.





డైరెక్టర్, దూదర్శన్
శ్రీమతి శైలజా సుమన్‌గారిచే సత్కారం



ప్రముఖ నటి శ్రీమతి జమునా రమణారావు
గారికి ఉగాది పురస్కార ప్రధానం. చిత్రంలో
టి.టి.డి. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్
శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్., గారు,
దూరదర్శన్ కార్యక్రమ నిర్వహణాధికారి
డా॥ ఓలేటి పార్వతీశం, ప్రధాన పరిపాలన
శాఖలో సహాయ కార్యదర్శి శ్రీమతి
జి. కృణవేణి, శేషుశేఖర్‌గార్లు ఉన్నారు.



“నీలోకి నువ్వు” ఆధ్యాత్మిక పుస్తకావిష్కరణ
సందర్భంగా, ఆవిష్కర్త డా॥ ముదిరాజు
శివప్రసాద్, డా॥ ద్వానా శాస్త్రి,
డా॥ పోతుకూరి సాంబశివరావు,
శ్రీ బైసా దేవదాసు, శ్రీ కళా వేంకట
దీక్షితులు, శ్రీ తూములూరి రాజేంద్రప్రసాద్,
శ్రీ గుదిబండి వెంకట రెడ్డి,
శ్రీ కె. మాధవరావు ఉన్నారు.



“ఊహలవసంతం” కవితా సంపుటికి
‘సృజన సాంస్కృతిక వేదిక’ నెల్లూరువారిచే
రాష్ట్రస్థాయి ద్వితీయ ఉత్తమ కవితా
సంపుటి పురస్కార ప్రధానోత్సం.